


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 12-09-2025 | సంపుటి - 26 | సంచిక - 121 | రూ : 4 | పేజీలు: 8




## హైదరాబాద్ శివారులో కుండపోత వర్షం

- ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లు కుండపోత వర్షం
- రోడ్ల మీద నీరు నిలవడంతో వాహనదారుల ఇబ్బందులు
- మెదక్ జిల్లాలోనూ భారీ వర్షా లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 :** హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కొద్ది నిమిషాల్లోనే రహదారులన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్ నగర్, అబ్దుల్లా పూర్‌మెట్

తరువాయి 2లో

## అది పెయిడ్ క్యాంపెయిన్

### నన్నే టార్గెట్ చేశారు గడ్కరీ సంచలన వ్యాఖ్యలు

- ఈ20 పెట్రోల్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్నది పెయిడ్ క్యాంపెయిన్ అన్న గడ్కరీ
- రాజకీయంగా తనను లక్ష్యంగా చేసుకునే ఈ దాడి అని వ్యాఖ్య
- ఇథనాల్ విధానంతో రైతులకు రూ. 45,000 కోట్ల మేలు జరిగిందని వెల్లడి



2లో



## మారిషస్‌కు రూ.5,984 కోట్ల సాయం

- ఏడు ఒప్పందాలపై సంతకం
- ఇకపై స్థానిక కరెన్సీలో వాణిజ్యం: మోదీ
- వారణాసిలో ఆ దేశ ప్రధానితో భేటీ

వారణాసి: భారతీయులు అధికంగా ఉండే మారిషస్‌కు మన దేశం రూ.5,984 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. దీంతోపాటు తీర ప్రాంత భద్రత వంటి 7 కీలక ఒప్పందాలను ఆ దేశంతో కుదుర్చుకుంది. భారత పర్యటనకు వచ్చిన మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రాంగులాం.. ప్రధాని మోదీ గురువారం వారణాసిలో భేటీ అయ్యారు. అనంతరం భారత ప్రధాని ఒక

తరువాయి 2లో

## భారత్-నేపాల్ సరిహద్దులో హై అలర్ట్..

### 30 మంది ఖైదీల అరెస్ట్




2లో

- నేపాల్‌లో అల్లర్ల నడుమ జైళ్ల నుంచి తప్పించుకున్న ఖైదీలు
- భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించగా భగ్నం చేసిన ఎస్ఎస్‌బీ
- యూపీ, బీహార్, బెంగాల్ రాష్ట్రాల సరిహద్దుల్లో 30 మంది అరెస్ట్

# రాష్ట్రాభివృద్ధికి రైల్వే ప్రాజెక్టులు అత్యంత కీలకం

- విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్టు అనుసంధానించాలి
- హైస్పీడ్ కారిడార్ల ఎలైన్‌మెంట్‌ను మరోసారి పరిశీలించాలి
- సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశం

2లో



## కవితకు చింతమడక వాసుల ఆహ్వానం..

- బతుకమ్మ వేడుకల్లో తమతో కలిసి పాల్గొనాలని కోరిన గ్రామస్తులు
- ఈ నెల 21న జరిగే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని విజ్ఞప్తి
- పెద్ద ఎత్తున తరలి వచ్చిన గ్రామస్తులు



2లో



## మాజీ మంత్రి కేటీఆర్‌కు అరుదైన గౌరవం

'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఎంపిక

2లో

## హైదరాబాద్ వాసులకు గుడ్ న్యూస్..

# మీ ఫోన్‌లోనే జీహెచ్ఎంసీ సేవలు

- పౌరసేవల కోసం జీహెచ్ఎంసీ సరికొత్త వాట్సప్ చాట్‌బాట్
- వాట్సప్‌లోనే ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్ చెల్లింపులు
- ఫిర్యాదులు చేస్తే నేరుగా సంబంధిత అధికారికి సమాచారం
- జనన, మరణ ధ్రువపత్రాల వివరాలు సులభంగా తెలుసుకునే వీలు
- కృత్రిమ మేధ (ఏఐ)తో 24 గంటలూ అందుబాటులో సేవలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 :** హైదరాబాద్ నగరవాసులకు జీహెచ్ఎంసీ సేవలు ఇకపై మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయి. పౌరులు తమ స్మార్ట్‌ఫోన్‌లోని వాట్సప్ ద్వారానే ఫిర్యాదులు చేయడం, పన్నులు చెల్లించడం వంటి పనులను చక్కబెట్టుకునేలా సరికొత్త వ్యవస్థను జీహెచ్ఎంసీ సిద్ధం చేస్తోంది. ఇందుకోసం కృత్రిమ మేధ (ఏఐ)

తరువాయి 2లో



# సింగిల్ బుల్లెట్ తో ట్రంప్ సన్నిహితుడి కాల్చివేత... స్నైపర్ కోసం ముమ్మర వేట

* **యూటా యూనివర్సిటీలో ప్రముఖ యాక్టివిస్ట్ చార్లీ కిర్క్ దారుణ హత్య**
* **స్నైపర్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన కిర్క్**
* **పైకప్పు నుంచి కాల్పులు జరిపినట్లు పోలీసుల అనుమానం**
* **రంగంలోకి దిగిన ఫెడరల్ ఏజెంట్లు, కొనసాగుతున్న విచారణ**
* **అమెరికా వ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం**

**అమెరిక, సెప్టెంబర్ 11:** అమెరికాలోని యూటా రాష్ట్రంలో ఓ స్నైపర్ కోసం పోలీసులు, ఫెడరల్ ఏజెంట్లు ముమ్మరంగా గాలిస్తున్నారు. ప్రముఖ కన్జర్వేటివ్ యాక్టివిస్ట్, దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్‌ను అత్యంత పకడ్బందీగా, ఓ భవనం పైకప్పు నుంచి ఓ స్నైపర్ సింగిల్ బుల్లెట్‌తో చంపిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ హత్యతో యూటా వ్యాలీ యూనివర్సిటీ ప్రాంగణం ఉలిక్కిపడింది. హంతకుడిని పట్టుకునేందుకు అధికారులు పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపట్టారు.

**అసలేం జరిగింది?**

యూటా వ్యాలీ యూనివర్సిటీలో జరిగిన 'ది అమెరికన్ కమ్‌బ్యాక్' అనే కార్యక్రమంలో ఈ దారుణం చోటుచేసుకుంది. సుమారు 3000 మంది పాల్గొన్న ఈ సభలో చార్లీ కిర్క్ ప్రసంగిస్తూ, తుపాకీ హింసపై అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తున్నారు. ఓ వ్యక్తి ట్రాన్స్‌జెండర్ మాస్ షూటర్ల గురించి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తుండగా, ఒక్కసారిగా ఆయన గొంతులోంచి రక్తం చిమ్మింది. ఏం జరిగిందో తెలుసుకునేలోపే ఆయన వేదికపైనే కుప్పకూలిపోయారు. వెంటనే ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనలో కిర్క్ మాత్రమే గాయపడ్డారని, మిగతా వారంతా సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు.

**నిందితుడి కోసం వేట**

ఈ దాడిని అత్యంత తీవ్రంగా పరిగణించిన పోలీసులు, క్యాంపస్‌లోని ఓ భవనం పైకప్పు నుంచి స్నైపర్ కాల్పులు జరిపి ఉంటాడని బలంగా అనుమానిస్తున్నారు. ఘటన జరిగిన 18 గంటల తర్వాత కూడా నిందితుడు పరారీలోనే ఉన్నాడని యూటా ప్రజాభద్రతా విభాగం కమిషనర్ బో మెసన్ వెల్లడించారు. సెక్యూరిటీ కెమెరా ఫుటేజ్‌లో నల్లటి దుస్తులు ధరించిన ఓ వ్యక్తి కనిపించాడని, అతడి కోసమే గాలిస్తున్నామని తెలిపారు. పోలీసులు కిర్క్‌పై కాల్పులు జరిపిన ప్రదేశం, అనుమానితుడు ప్రయాణించిన మార్గాలను 'యాక్టివ్ క్రైమ్ సీన్స్'గా గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు విచారణలో స్థానిక పోలీసులకు ఫెడరల్ ఏజెంట్లు కూడా సహకరిస్తున్నారు.

**క్యాంపస్‌లో భద్రత కట్టుదిట్టం**

ఈ హత్య నేపథ్యంలో దాదాపు 47,000 మంది విద్యార్థులున్న యూటా వ్యాలీ యూనివర్సిటీలో అధికారులు 'సెక్యూర్ ఇన్ ప్లేస్' ఆదేశాలు జారీ చేసి, క్యాంపస్‌ను గంటలపాటు మూసివేశారు. ఘటన తర్వాత ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించినప్పటికీ, వారికి ఈ హత్యతో సంబంధం లేదని తేలడంతో విడుదల చేశారు. అయితే, పోలీసుల విచారణకు ఆటంకం కలిగించాడనే ఆరోపణలపై ఓ రాజకీయ కార్యకర్తపై కేసు నమోదు చేసినట్లు యూనివర్సిటీ పోలీసులు తెలిపారు. ప్రస్తుతం స్నైపర్‌ను పట్టుకోవడానికి పెద్ద ఎత్తున వేట కొనసాగుతోంది. ఈ హత్య వెనుక ఉన్న ఉద్దేశం ఏంటనేది ఇంకా తెలియరాలేదు. ఈ ఘటన అమెరికాలో రాజకీయ హింస, తుపాకీ సంస్కృతిపై మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. విచారణ పూర్తయితే గానీ మరిన్ని వివరాలు తెలిసే అవకాశం లేదు.

# కేటీఆర్‌కు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారం

* **ప్రతిష్ఠాత్మక 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఎంపిక**
* **పర్యావరణ పరిరక్షణ కృషి చేశారంటూ పురస్కారం**
* **అమెరికాలోని న్యూయార్క్‌లో జరగనున్న అవార్డు ప్రదానోత్సవం**
* **ఈ నెల 24న 'ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్'లో పురస్కార ప్రదానం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11** :బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. పర్యావరణ పరిరక్షణకు కేటీఆర్ కృషి చేశారంటూ, ఆయనను 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఎంపిక చేశారు. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఘనంగా జరగనుంది. ఈ నెల సెప్టెంబర్ 24వ తేదీన అక్కడ నిర్వహించనున్న 9వ 'ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్' వేదికగా కేటీఆర్‌కు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. పర్యావరణ పరిరక్షణ, హరిత విధానాల అమలులో కేటీఆర్ గతంలో మంత్రిగా ఉన్నప్పుడు చొరవ చూపారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పురస్కారం కేటీఆర్‌కు వ్యక్తిగతంగానే కాకుండా, తెలంగాణలో పర్యావరణ పరిరక్షణకు జరిగిన ప్రయత్నాలకు లభించిన అంతర్జాతీయ గుర్తింపుగా పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# భారత్–నేపాల్ సరిహద్దులో హై అలర్ట్.. 30 మంది ఖైదీల అరెస్ట్

**నేపాల్, సెప్టెంబర్ 11:** నేపాల్‌లో నెలకొన్న అశాంతిని ఆసరాగా చేసుకుని అక్కడి జైళ్ల నుంచి తప్పించుకున్న ఖైదీలు భారత్‌లోకి ప్రవేశించేందుకు చేసిన యత్నాలను సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) బలగాలు భగ్నం చేశాయి. దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన 30 మంది నేపాలీ ఖైదీలను ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల సరిహద్దుల్లో అదుపులోకి తీసుకున్నాయి. ఈ పరిణామంతో కేంద్ర భద్రతా ఏజెన్సీలు భారత్‌నేపాల్ సరిహద్దులో హై అలర్ట్ ప్రకటించాయి. వివరాల్లోకి వెళితే... నేపాల్‌లో జరుగుతున్న హింసాత్మక నిరసనల మధ్య పలువురు ఖైదీలు జైళ్ల నుంచి పారిపోయారు. వీరిలో కొందరు భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన ఎస్ఎస్‌బీ జవాన్లు సరిహద్దుల్లో గస్తీని ముమ్మరం చేసి చొరబాట్లను అడ్డుకున్నారు. అరెస్టయిన వారిలో 17 మందిని ఉత్తరప్రదేశ్‌లో, మిగిలిన 13 మందిని బీహార్, పశ్చిమ బెంగాల్ సరిహద్దు ప్రాంతాల్లో పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బుధవారం సాయంత్రం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బీహార్ ప్రభుత్వం అత్యంత అప్రమత్తమైంది. నేపాల్‌తో సరిహద్దు పంచుకుంటున్న పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామర్హి, మధుబని సహా ఏడు జిల్లాల్లో హై అలర్ట్ విధించారు. బిహార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యయ అమృత్, డీజీపీ వినయ్ కుమార్‌తో కలిసి సరిహద్దు జిల్లాల డీఎంలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. చొరబాట్లను నిరోధించేందుకు ఎస్ఎస్‌బీ బలగాలతో కలిసి రాష్ట్ర పోలీసులు సంయుక్తంగా గస్తీ నిర్వహిస్తున్నారు. చిక్కుకున్న భారతీయులకు ఊరట మరోవైపు, నేపాల్‌లో అల్లర్ల కారణంగా చిక్కుకుపోయిన భారతీయులకు ఊరట లభించింది. ఖాట్మండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. దీంతో రాజస్థాన్‌కు చెందిన పలు కుటుంబాలు స్వదేశానికి తిరిగి వచ్చేందుకు మార్గం సుగమమైంది. చిక్కుకున్న వారిని త్వరగా తరలించేందుకు కొన్ని రోజుల పాటు అదనపు విమానాలు నడపాలని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలను ఆదేశించింది.

# కవితకు చింతమడక వాసుల ఆహ్వానం

**హైదరాబాద్, సెప్టెంబర్ 11** : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఆమె తండ్రి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత గ్రామమైన చింతమడక నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకల్లో తమతో కలిసి పాల్గొనాలని గ్రామస్తులు ఆమెను కోరారు. ఈ నెల 21వ తేదీన జరిగే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ చింతమడక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో గురువారం హైదరాబాద్‌లోని కవిత నివాసానికి తరలివచ్చారు. తమ గ్రామ ఆడపడుచుగా భావించి, పండుగకు తప్పకుండా రావాలని వారు కవితను ఆత్మీయంగా ఆహ్వానించారు.

# అది పెయిడ్ క్యాంపెయిన్.. నన్నే టార్గెట్ చేశారు

**ఢిల్లీ, సెప్టెంబర్ 11** : పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం (E20)పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రంగా స్పందించారు. అదంతా తనను రాజకీయంగా లక్ష్యంగా చేసుకుని, డబ్బులిచ్చి నడిపిస్తున్న ప్రచారం అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. సొసైటీ ఆఫ్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ వార్షిక సదస్సులో పాల్గొన్న ఆయన, ఇథనాల్ మిశ్రమంపై వస్తున్న ఆందోళనలపై అడిగిన ప్రశ్నలకు ఈ విధంగా బదులిచ్చారు. "మీ ఆటోమొబైల్ పరిశ్రమ ఎలా పనిచేస్తుందో, రాజకీయాలు కూడా అలాగే ఉంటాయి. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి డబ్బులు ముట్టాయి. అది రాజకీయంగా నన్ను దెబ్బతీయడానికే. అందులో ఎలాంటి నిజం లేదు. ప్రతి విషయం స్పష్టంగా ఉంది" అని గడ్కరీ అన్నారు. ఇథనాల్ మిశ్రమం అనేది విదేశీ ఇంధన దిగుమతులకు ప్రత్యామ్నాయమని, ఖర్చు తక్కువని, కాలుష్య రహితమని, పూర్తిగా స్వదేశీ అని ఆయన పునరుద్ఘాటించారు. భారత్ ఏటా శిలాజ ఇంధనాల దిగుమతి కోసం భారీ మొత్తంలో ఖర్చు చేస్తోందని గడ్కరీ గుర్తుచేశారు. ఆ దిగుమతులను తగ్గించి, ఆ డబ్బును దేశ ఆర్థిక వ్యవస్థలో భాగం చేయడం మంచిది కాదా అని ఆయన ప్రశ్నించారు. "మనం మొక్కజొన్న నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తున్నాం. ఈ విధానం వల్ల రైతులకు రూ. 45,000 కోట్లు లాభం చేకూరింది" అని ఆయన వివరించారు. కాలుష్యం కోణంలోనూ ఆయన మాట్లాడుతూ, "ప్రస్తుత కాలుష్య స్థాయిలు ఇలాగే కొనసాగితే ఢిల్లీ వాసుల ఆయుష్షు పదేళ్లు తగ్గిపోతుందని ఓ నివేదిక చెబుతోంది. ప్రపంచమంతా కాలుష్యాన్ని తగ్గించాలని అంగీకరిస్తోంది" అని తెలిపారు. E20 పెట్రోల్ వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందని, ఇంజిన్ భాగాల జీవితకాలం తగ్గిపోతోందని కొందరు వాహనదారులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ వాదనలు అవాస్తవమని ప్రభుత్వం కొట్టిపారేసింది. వాహన మైలేజీ అనేది కేవలం ఇంధనంపైనే కాకుండా, నడిపే విధానం, టైర్లలో గాలి, ఏసీ వాడకం, సరైన నిర్వహణ వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది. పైగా, E20 పెట్రోల్ వల్ల మెరుగైన యాక్సిలరేషన్, రైడ్ క్వాలిటీతో పాటు కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ విధానాన్ని వెనక్కి తీసుకుంటే కాలుష్య నియంత్రణలో సాధించిన ప్రగతిని కోల్పోవాల్సి వస్తుందని పేర్కొంది.



# మారిషస్‌కు రూ.5,984 కోట్ల సాయం

వారణాసి: భారతీయులు అధికంగా ఉండే మారిషస్‌కు మన దేశం రూ.5,984 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. దీంతోపాటు తీర ప్రాంత భద్రత వంటి 7 కీలక ఒప్పందాలను ఆ దేశంతో కుదుర్చుకుంది. భారత పర్యటనకు వచ్చిన మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రాంగులాం.. ప్రధాని మోదీ గురువారం వారణాసిలో భేటీ అయ్యారు. అనంతరం భారత ప్రధాని ఒక ప్రకటన విడుదల చేశారు. 'రెండు దేశాలు భాగస్వాములే కాదు. ఒకే కుటుంబం. మారిషస్ ఆర్థిక మండలి రక్షణను బలోపేతం చేయడానికి భారత్ కట్టుబడి ఉంది. రెండు దేశాలు స్థానిక కరెన్సీలో వాణిజ్యం నెరపుతాయి. ఇప్పటికే ఆ దేశంలో యూపీఐ, రూపే కార్డులను ప్రారంభించాం. భారత్ అందించే ఆర్థిక సాయంతో అక్కడి పోర్టు, విమానాశ్రయం, రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు కొత్తగా పాఠశాలలు, ఆసుపత్రులను నిర్మిస్తాం. ఇది ఆర్థిక సాయం కాదు. భవిష్యత్తుకు పెట్టుబడి' అని మోదీ వివరించారు. మారిషస్ సార్వభౌమత్వాన్ని గౌరవించే చాగోస్ ఒప్పందం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని రాంగులాంకు, మారిషస్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గత మే నెలలో డీగో గార్షియాతోపాటు చాగోస్ ద్వీపాలను బ్రిటన్ మారిషస్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. పొరుగే ముందు అనే విధానంలో భాగంగా భారత్ విజన్ అయిన 'మహాసాగర్‌లో (మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఎక్రాస్ రీజియన్) మారిషస్ కీలక పాత్రధారని మోదీ తెలిపారు.

* మారిషస్ ఆర్థిక మండళ్లపై హైడ్రోగ్రఫీ చేస్తారు. ఇందులో భాగంగా సంయుక్త సర్వేలతోపాటు నేవిగేటింగ్ చార్టులను తయారు చేస్తారు. హైడ్రోగ్రాఫిక్ డేటాను రూపొందిస్తారు.
* మిషన్ కర్మయోగిలో భాగంగా మారిషస్‌లో శిక్షణ మాడ్యూల్స్ త్వరలో ప్రారంభం కానున్నాయి.
* ఆ దేశంలో డైరెక్టరేట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏర్పాటు కానుంది.
* ఐఐటీ మద్రాస్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్.. యూనివర్సిటీ ఆఫ్ మారిషస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి.

**తొలిసారిగా వచ్చిన రాంగులాం**

* వారణాసికి ఉదయం 11.30 గంటలకు చేరుకున్న ప్రధాని మోదీ.. నేరుగా హోటల్ తాజ్‌కు వెళ్లి రాంగులాంతో భేటీ అయ్యారు. వారిద్దరూ రెండు గంటలపాటు చర్చలు జరిపారు. ఈ నెల 9వ తేదీన రాంగులాం భారత పర్యటన ప్రారంభమైంది. ఆయన 16వ తేదీ వరకూ భారత్‌లోనే ఉంటారు.

## హైదరాబాద్ వాసులకు గుడ్ న్యూస్..

# మీ ఫోన్‌లోనే జీహెచ్ఎంసీ సేవలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11** : హైదరాబాద్ నగరవాసులకు జీహెచ్ఎంసీ సేవలు ఇకపై మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయి. పౌరులు తమ స్మార్ట్‌ఫోన్‌లోని వాట్సప్ ద్వారానే ఫిర్యాదులు చేయడం, పన్నులు చెల్లించడం వంటి పనులను చక్కబెట్టుకునేలా సరికొత్త వ్యవస్థను జీహెచ్ఎంసీ సిద్ధం చేస్తోంది. ఇందుకోసం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత వాట్సప్ చాట్‌బాట్‌ను త్వరలోనే ప్రారంభించనుంది. ఈ చాట్‌బాట్ ద్వారా పౌరులు తమ సమస్యలను సులభంగా ఫిర్యాదు చేయవచ్చు. వాట్సప్‌లో ఫిర్యాదు నమోదు చేయగానే, ఆ సమాచారం నేరుగా సంబంధిత అధికారికి వెళ్తుంది. ఏ సమస్యకు ఏ అధికారిని సంప్రదించాలో కూడా ఈ చాట్‌బాట్ తెలియజేస్తుంది. దీనితో పాటు ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ వంటి చెల్లింపులను కూడా ఇకపై వాట్సప్ నుంచే పూర్తి చేసే సౌకర్యాన్ని కల్పించనున్నారు. ప్రస్తుతం ఈ సేవలు జీహెచ్ఎంసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో మాత్రమే ఉన్నాయి. అంతేకాకుండా, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్సులు వంటివి ఎలా పొందాలో, ఎవరిని సంప్రదించాలో వంటి వివరాలను కూడా ఈ చాట్‌బాట్ అందిస్తుంది. వార్డుల వారీగా అధికారుల ఫోన్ నంబర్లు సహా పూర్తి సమాచారం ఇందులో లభిస్తుంది. ప్రస్తుతం చాలా మందికి ఆన్‌లైన్ సేవలు, అధికారుల వివరాలపై సరైన అవగాహన లేకపోవడంతో చిన్న పనులకు కూడా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకే 24 గంటలూ అందుబాటులో ఉండే ఈ చాట్‌బాట్‌ను తీసుకొస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ చాట్‌బాట్ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన టెండర్లను వచ్చే వారంలోనే పిలవనున్నట్లు జీహెచ్ఎంసీ ఐటీ విభాగం వర్గాలు తెలిపాయి. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని, నగర పౌరులకు సేవలు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు.

# రాష్ట్రాభివృద్ధికి రైల్వే ప్రాజెక్టులు అత్యంత కీలకం

హైదరాబాద్: రాష్ట్రంలో పర్యాటకానికి, పారిశ్రామికాభివృద్ధికి రైల్వే ప్రాజెక్టులు కీలకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు, భూములు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్టు కనెక్టివిటీని అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పెండింగ్, ప్రతిపాదనల్లోని రైల్వే ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షించారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్ చెన్నై, హైదరాబాద్‌బెంగళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, ఎలైన్‌మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని రైల్వే అధికారులకు సూచించారు. హైవే వెంట రైలుమార్గం, పారిశ్రామిక కారిడార్ 'భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి ఏపీ రాజధాని అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేతోపాటు అనుసంధానంగా రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి. 12 వరుసలతో ఈ హైవేను ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశాం. దీనికి సంబంధించి 300 కి.మీ. ఎలైన్‌మెంట్‌తో ప్రతిపాదనలు తయారయ్యాయి. దానికి అనుగుణంగా రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి. రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న ఎలైన్‌మెంట్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన ఎలైన్‌మెంట్‌ను పరిశీలించాలి. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే వెంట రైలుమార్గం ఉండాలి. హైవేకు ఇరువైపులా 1.5 కి.మీ. దూరం వరకు పారిశ్రామిక కారిడార్‌ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయి. దాదాపు 362 కి.మీ. మేర ప్రాంతీయ వలయదారి వెంట 'రింగ్ రైలు' ఏర్పాటు చేయడంతో హైదరాబాద్ భవిష్యత్తు స్వరూపం మారిపోతుంది. ఈ ప్రాజెక్టును త్వరగా చేపట్టేందుకు అవసరమైన చర్యల్ని రైల్వే అధికారులు చేపట్టాలి. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్‌కు ప్రత్యేక రైల్వేలైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలి. వికారాబాద్‌కృష్ణా కొత్త రైల్వేలైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టడంతోపాటు గద్వాలడోర్నకల్ రైల్వేలైన్ పనుల డీపీఆర్ పూర్తి చేయాలి. భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలి. కాజీపేట జంక్షన్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలి' అని సీఎం సూచించారు. రాష్ట్రంలో కొత్త రైల్వే ప్రాజెక్టులపై ద.మ.రైల్వే జీఎంతో ఆయన ప్రత్యేకంగా చ ర్చించారు. సమావేశంలో ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్అండ్‌బీ, రవాణాశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆర్థికశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ద.మ.రైల్వే డీజీఎం ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

# గ్రూప్ - 1 పరీక్షల్లో అవకతవకలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

* **బీఆర్ఎస్వి రాష్ట్ర జనరల్ సెక్రటరీ వి అశ్వంత్ కుమార్**

కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అడిగే వారిని అరెస్టులు చేయడం కాదు గ్రూప్ 1పరీక్షల్లో అవకతవకలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వి రాష్ట్ర జనరల్ సెక్రటరీ వి అశ్వంత్ కుమార్ అన్నారు. గ్రూప్ వన్ పరీక్ష నిర్వహణంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ విఫలమైనందున నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని బీఆర్ఎస్వి శాంతియుత నిరసనలో భాగంగా జేఎన్టీయూ యూనివర్సిటీ మెయిన్ గేటు వద్ద నిరుద్యోగ విద్యార్థులతో కలిసి నిరసన తెలియజేస్తుంటే అరెస్ట్ చేసి జేఎన్టీయూ పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ జీవో నెం 29 రద్దు చేసి జీవో నెం 55 ఇంప్లీమెంటేషన్ చేయాలన్నారు. గ్రూప్ 1పరీక్షను రద్దు చేసి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. హైకోర్టు చెప్పినట్టుగా అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో జ్యూడిషియల్ కమిషన్ ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విచారణ చేయాలన్నారు. గ్రూప్ 1 పరీక్షల్లో అవకతవకలకు




బాధ్యత వహించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీజీపిఎస్సీ చైర్మన్, కమిషన్ అధికారులు వెంటనే రాజీనామా చేయాలన్నారు. లేనియడల ప్రభుత్వంపై యుద్ధం చేయక తప్పదు గ్రూప్ 1 అభ్యర్థులకు న్యాయం జరిగేంత వరకు బీఆర్ఎస్వి పోరాటం చేయక తప్పదు అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి నాయకులు . అఖిల్,కళ్యాణ్, రాజు విక్రమ్ శివ శ్రావణ దుర్గ అక్షయ రమణ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు

## జిల్లా సైబర్ క్రైమ్స్ కోఆర్డినేషన్ సెంటర్ డిఎస్పీగా బి.అశోక్ బాధ్యతలు స్వీకరణ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఇటీవల డిఎస్పీగా పదోన్నతి పొందిన బి.అశోక్ గురువారం జిల్లా సైబర్ క్రైమ్స్ కోఆర్డినేషన్ సెంటర్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఎస్పీ రోహిత్ రాజును ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

## మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

* **మాదకద్రవ్యాల వినియోగం,అక్రమ రవాణా , ర్యాగింగ్ వ్యతిరేక అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: యువత,విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యసాధనకై కృషి చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. పాల్వంచ (నవభారత్) కెఎస్ ఎం ఇంజినీరింగ్ కళాశాల నందు ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ తెలిపారు.విద్యార్థుల దృష్టి తమ భవిష్యత్తు,జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని,నిషేధిత గంజాయి,డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు,యువత ఆకర్షితులు కావద్దని జిల్లా అన్నారు.గంజాయి,డ్రగ్స్ అలవాటు వలన శారీరక , మానసిక ఆరోగ్యాన్ని పాడుచేస్తుందని కావున చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.మాదక ద్రవ్యాల నిర్మూలన గంజాయి రహిత జిల్లానే లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం పోలీసు శాఖ కృషి చేస్తోందని అందులో బాగంగా విద్యాసంస్థలు,గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మత్తుకు బానిస అవడానికి అనేక కారణాలు ఉంటాయి పరిసరాల ప్రభావం,చెడు స్నేహితులు,సన్నిహితుల వలన చెడు మార్గాల వైపు వెళ్ళవద్దని సూచించారు.గంజాయి,డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేయడంతో పాటు భవిష్యత్ లేకుండా చేస్తుందనే విషయాన్ని విద్యార్థులు, యువత గ్రహించి అలాంటి చెడు అలవాట్లకు ఆకర్షితులవ్వద్దని విజ్ఞప్తి చేశారు.మత్తు పదార్థాలను అరికట్టేందుకు యువత,విద్యార్థులు అంతా యాంటీ డ్రగ్స్ కమిటీలలో సభ్యులుగా చేరి యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా సహకరించాలని తెలిపారు. డ్రగ్స్ నివారణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. యువత యొక్క ప్రవర్తనను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తూ వారు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా గమనిస్తూ ఉండాలని సూచించారు. మీ మీ ప్రాంతాలలో ఎక్కడైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబధిత సమాచారాన్ని స్థానిక పోలీసులకు ఇవ్వాలని కోరారు. యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో సుమారుగా 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా విద్యార్థులు ఎవరైనా ర్యాగింగ్ నకు పాల్పడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళ్లు ఎన్నో రకాలుగా అమాయకుల ఖాతాల్లో నుండి నగదును కాజేస్తున్నారని,ఎప్పటికప్పుడు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగియుండి తమ చుట్టుప్రక్కల వారికి కూడా అవగాహనా కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియా వినియోగించేటప్పుడు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్ రావు మరియు పాల్వంచ ఎస్సై సుమన్,కళాశాల అధ్యాపాకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.




**కాంట్రాక్టు కార్మికులకు 15% బోనస్ చెల్లింపు, సమస్యల పరిష్కారానికై**

## కొత్తగూడెంలో ఐఎఫ్ టియు ప్రదర్శన, హెడ్ ఆఫీస్ ముందు ధర్నా

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఎస్ సి సిడబ్ల్యూయు ఐఎఫ్ టియు) ఆధ్వర్యంలో గురువారం సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి.రాసుద్దిన్ అధ్యక్షత వహించగా ఈ ధర్నా నుద్దేశించి జిఎల్ కెఎస్ జనరల్ సెక్రెటరి జె.సీతారామయ్య, (ఎస్ సి సిడబ్ల్యూయు ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్నలు మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సింగరేణి లాభాలలో 15 శాతం లాభాల వాటాను బోనసుగా చెల్లించాలని డిమాండు చేశారు.సింగరేణి పరిశ్రమలో 40వేల మంది పెర్మనెంటు కార్మికులు 30 వేలమంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తు న్నారని అన్నారు.అతి తక్కువ వేతనాలతోకాంట్రాక్టుకార్మికులు విధులు నిర్వహించడం వల్ల సింగరేణికి లాభాలు వస్తున్నాయని వారు వివరించారు.2013 నుంచి కోల్ ఇండియాలో అమలు చేస్తున్న హై పవర్ కమిటీ వేతనాలు సింగరేణిలో చెల్లించాల్సి ఉండగా సింగరేణి యాజమాన్యం మొండికేస్తున్నదని హెచ్ పిసి వేతనాలకై సంతకం పెట్టిన జేబిసిసిఐ సంఘాలు,సింగరేణిలో గెలిచిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు నోరు మేదపటం లేదన్నారు.కాంట్రాక్టు కార్మికులను నమ్మించేందుకు గెలిచిన సంఘాలు వేతనాలు పెంచుతామని మాట్లాడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు హైపర్ కమిటీ వేతనాలు చెల్లించాలని అన్నారు. అలాగే గత నాలుగు సంవత్సరాలుగా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు సిఎంపిఎఫ్ చిట్టీలు ఇవ్వాలని, సింగరేణి వ్యాప్తంగా 213 మంది సులభ్ కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ,పీఎఫ్, బోనస్ చట్టాలను అమలు చేయాలని డిమాండు చేశారు. సింగరేణి యాజమాన్యం సులబ్ ఇంటర్నేషనల్ సోషల్ ఆర్గనైజేషన్ పేరుతో సాగిస్తున్న శ్రమ దోపిడికి అండగా ఉంటుందని దీనిని యాజమాన్యం విడనాడాలని సులువు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారి డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ కంపెనీ క్వార్టర్,ఓటు హక్కు కల్పించాలని,జాతీయ పండుగ సెలవులు అమలు చేయాలని అన్నారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల బోనసు హై పవర్ వేతనాలు లేదా సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం 8 గంటల పని హాస్పిటల్ ఈఎస్ఐ యూనిఫామ్ సేఫ్టీ తదితర సమస్యలను పరిష్కరించకపోతే తిరిగి చలో హైదరాబాద్ సింగరేణి భవన్ ముట్టడికి పూనుకోవాల్సి వస్తుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్ సి సిడబ్ల్యూయుఐఎఫ్ టియు) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు డి.బ్రహ్మానందం,రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌనీ నాగేశ్వర్ రావు, కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యన్. సంజీవ్,ఉపాధ్యక్షులు మోత్కూరి మల్లికార్జునరావు,రాష్ట్ర నాయకులు యాదగిరి, కృష్ణవేణి,బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్,ఆజర్ల అంజయ్య,కృష్ణ, నరసింహ,వెంకన్న శ్రీనివాసు,రాజు ,సదానందం, రాజేశ్వరి,జోరు నరేష్,బొడ్డు దేవేందర్ లు నాయకత్వం వహించగా సింగరేణి 11 ఏరియాలకు చెందిన 200 మంది కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.




## సెమ్స్ ఒలంపియాడ్ లో సత్తా చాటిన టీవిఆర్ విద్యార్థులు

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : 2024 2025 విద్యా సంవత్సరంలో లెవెల్ 1, లెవెల్ 2 నిర్వహించిన "సెమ్స్ ఒలంపియాడ్" జాతీయ, రాష్ట్ర , జోనల్ స్థాయి పరీక్ష పోటీలలో టీవిఆర్ మోడల్ హైస్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు. గురువారం సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని అపురూప కాలనీలో గల టివిఆర్ మోడల్స్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో టివిఆర్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి పాల్గొని సెమ్స్ ఒలంపియాడ్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు.సెమ్స్ ఒలంపియాడ్" జాతీయ, రాష్ట్ర , జోనల్ స్థాయి పరీక్ష పోటీలలో విద్యార్థులు తమ సత్తా చాటి పాఠశాల కీర్తిని చాటారన్నారు. అనంతరం టాలెంట్ పరీక్షలలో జాతీయ, రాష్ట్ర స్థాయి విజేతలకు పురస్కార్ అవార్డులతో పాటు పదివేల రూపాయల నగదు బహుమతిని అందజేసి శాలువాతో చిన్నారులను సత్కరించారు. జాతీయస్థాయిలో రెండవ స్థానం సాధించిన కె. ఒలివ గ్రేసీ 3 వ తరగతి 10.000/ రూ నగదు, రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానం సాధించిన "దానిష్ ఖాన్" 2.500/ రూ నగదు అందజేశారు. మిగిలిన 17 మంది విద్యార్థిని విద్యార్థులు కూడా బహుమతులతో పాటు మెడల్స్, మెమెంటోస్, సర్టిఫికెట్స్ బహుమతి పొందారు. టివిఆర్ విద్య సంస్థల ఛైర్మెన్ టీ. కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి విద్యార్థులకు తీర్చిదిద్దిన అధ్యాపక బృందాన్నీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం. జయరాజ్ తో పాటు అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతమ్ కు ఘన సన్మానం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతమ్ ను టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు ఘనంగా సన్మానించారు. జిల్లా పర్యటనకు వచ్చిన కార్పొరేషన్ చైర్మన్ ప్రితమ్ సుజాతనగర్ లోని నాగా సీతారాములు ఇంట్లో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రితమ్ ను శాలువాలతోసన్మానించి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రీతమ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమములో ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్,మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పతి కుమార్,ఖమ్మం జిల్లా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొందయ్య,మరియు ఎస్సీ సెల్ నాయకులు గద్దల.రమేష్ తదతరులు పాల్గొన్నారు.

## సౌదీ బ్యాంకులో బందీ అయిన తన కష్టార్జితాన్ని ఇప్పించండి...

- **సిఎం ప్రవాసి ప్రజావాణిలో వేడుకున్న ముస్తాబాద్ వాసి**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: సౌదీ బ్యాంకులో బందీ అయిన తన కష్టార్జితాన్ని ఇప్పించాలని వేడుకుంటున్నాడు ముస్తాబాద్ మండల వాసి. ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామానికి చెందిన రాగం రాజమల్లు సౌదీ అరేబియా దేశం అభా పట్టణ సమీపంలోని అల్‌హరాజా మున్సిపాలిటీలో 2014 నుంచి 2025 వరకు 10 సంవత్సరాల పాటు క్లీనర్‌గా పనిచేశాడు. రాజమల్లు పని చేసిన పదేళ్ల కాలానికి సంబంధించిన 'ఎండ్ ఆఫ్ సర్వీస్ బెనిఫిట్స్' (ఉద్యోగ విరమణ ప్రయోజనాలు) 21,500 సౌదీ రియాళ్ళు (సుమారు రూ.5 లక్షలు) సొమ్మును యాజమాన్యం సౌదీలోని అతని బ్యాంకు ఖాతాలో జమా చేసింది. డబ్బును అకౌంట్ నుంచి తీసుకునే లోగానే అతన్ని ఫిబ్రవరి 12న ఇండియాకు పంపించేశారు. 'సౌదీ నేషనల్ బ్యాంక్'లోని తన ఖాతాలో ఉన్న సొమ్మును ఇండియాలోని తన బ్యాంకు ఖాతాకు బదలాయింపు చేయించాలని లేకపోతే రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ద్వారా అందించాలని కోరుతూ రాజమల్లు హైదరాబాద్ బేగంపేట ప్రజాభవన్‌లో సీఎం ప్రవాసీ ప్రజావాణిలో మంగళవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి వినతి ద్వారా వేడుకున్నారు. దీంతో తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్‌ఆర్‌ఐ అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, గల్ఫ్ జెఎసి నాయకుడు తోట ధర్మేందర్‌లు అతనికి అండగా నిలిచారు. ఈ డబ్బును సౌదీ బ్యాంక్ నుంచి భారత్‌కు బదిలీ చేయించడానికి, తమ కంపెనీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్వో), పాకిస్థాన్ జాతీయుడైన మహమ్మద్ బిలాల్‌కు 'పవర్ ఆఫ్ అటార్నీ' ఇచ్చానని రాజమల్లు తెలిపారు. తన సమస్యను జిద్దాలోని ఇండియన్ కాన్సులేట్ (భారత దౌత్య కార్యాలయం) దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన కోరారు.

## సొంతింటి పథకం అమలు చేయాలని బ్యాలెట్ ఓటింగ్ విజయవంతం

* **ఓటింగ్ ను అడ్డుకోవడానికి నిరంకుశ పద్ధతులు అవలంబించిన సింగరేణి యాజమాన్యం**
* **స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్మికులు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి వ్యాప్తంగా సిఐటియు నిర్వహిస్తున్న సొంత ఇంటి పథకం అమలు కోసం బ్యాలెట్ ఓటింగ్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సొంత ఇల్లు కావాలని కోరుకుంటున్నారని సింగరేణి కాలరేస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈరోజు పివికే గనిలో నిర్వహించిన బ్యాలెట్ ఓటింగ్ లో సింగరేణి బొగ్గు బావుల వద్ద ,అధికారుల కార్యాలయాల వద్ద గని కార్మికులు పాల్గొని అధిక అధిక సంఖ్యలో కార్మికులు అధికారులు పాల్గొన్నారన్నారు. యాజమాన్యం నిరంకుశంగా ఈ కార్యక్రమం అమలు జరగకుండా ఉండడానికి క్రింద సాయి అధికారులకు గేటు బయటనే నిర్వహించాలని ఎన్ని ఆంక్షలు విధించి ఆదేశాలు జారీ చేసినప్పటికీ కార్మికులు దీనిని పూర్తిగా విస్మరిస్తూ ఓటింగ్లో పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు , సింగరేణి కోల్ బెల్ట్ ఏరియా ప్రభుత్వ ప్రజాప్రతినిధులు సొంతింటి పథకం అమలు చేస్తామని హామీలు ఇచ్చినప్పటికీ ఏమాత్రం కూడా చిత్త శుద్ధితో వ్యవహరించలేదని దీనికి నిదర్శంగా గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలలో ఉన్న కార్యకర్తలు ఓటింగ్లో పాల్గొన్నారని తెలిపారు. కార్మికుల అభిప్రాయాన్ని మరో మారు సింగరేణి యాజమాన్యం దృష్టికి ప్రజా ప్రతినిధులకు ఈ ఓటింగ్ ద్వారా కార్మికులు ఏమి కోరుకుంటున్నారో వారి అభిప్రాయాన్ని ఈనెల 15వ తేదీన సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద ఫలితాన్ని బహిరంగ పరుస్తామని ఆయన అన్నారు. అన్నారు. కొత్తగూడెం ఏరియాలో అన్ని మైన్స్ డిపార్ట్మెంట్లలో బ్యాలెట్ ఓటింగ్ విజయవంతమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వై వెంకటేశ్వరరావు, ఎలగొండ శ్రీరామమూర్తి, గడల నరసింహారావు, లిక్కి బాలరాజు,భూక్యా రమేష్, కార్తిక్ , సంపత్, బాలరాజు, నందిపాటి రమేష్ , పి.వి. లక్ష్మీనారాయణ, , ఆనందరావు, నునావత్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ మెడికల్ స్టోర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రామవరం మాత శిశు ఆరోగ్య కేంద్రంలోని సెంట్రల్ మెడికల్ స్టోర్ ను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మికంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టోర్‌లో నిల్వ ఉంచిన ఔషధాల లభ్యత, నాణ్యత, గడువు తేది, ఆసుపత్రులకు సరఫరా ప్రక్రియలను పరిశీలించారు. రోగులకు అవసరమయ్యే ఔషధాలు ఎల్లప్పుడూ సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, గడువు ముగిసిన మందులను తక్షణమే తొలగించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. తనిఖీ సందర్భంగా సెంట్రల్ మెడికల్ స్టోర్ సిబ్బంది కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. ప్రధాన రహదారి నుండి స్టోర్‌కు వచ్చే రహదారి మరమ్మత్తులు చేయాలని, స్టోర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మందుల నిల్వ రాకులు, బరువైన బాక్సులు ఎత్తడానికి అవసరమైన యంత్రాలను సమకూర్చాలని కోరగా స్పందించిన కలెక్టర్ అవసరమైన అన్ని సదుపాయాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. స్టోర్‌లోని ఒక హాల్ ఫ్లోరింగ్ పనులు పెండింగ్లో ఉన్న విషయాన్ని ఆయన గమనించారు. ఈ పనులను పూర్తిచేయడానికి అవసరమైన వ్యయంపై తక్షణమే నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించి, ఫ్లోరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి వాడుకలోకి తేవాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం దృష్ట్యా మెడికల్ స్టోర్ల



సమర్థవంతమైన నిర్వహణ అత్యంత కీలకమని, అవసరమైన సదుపాయాల కల్పనలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. మందులు కొరత రాకుండా సంబంధిత అధికారులు అవసరమైన ఇండెంట్లు సకాలంలో పంపించాలి, ప్రతి రోగికి అవసరమైన ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రతి అధికారికి, సిబ్బందికి ప్రజా ఆరోగ్యం అత్యున్నత ప్రాధాన్యతగా ఉండాలని, వైద్య రంగంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సీనియర్ ఫార్మసీ అధికారి శారద, ఫార్మసిస్ట్ అధికారి రామచందర్, సెంట్రల్ మెడికల్ స్టోర్స్ సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లోకి మారుతి సుజుకి అల్ న్యూ విక్టరిస్ కార్.....




శేర్లింగంపల్లి ప్రజాస్ఫూర్తి: మారుతి సుజుకి అల్ న్యూ విక్టరిస్ నూతన కారును మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఈ కారును మియాపూర్ మదీనాగూడలోని సాయి సర్వీస్ మారుతి సుజుకి షోరూమ్ లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అదితిగా స్థానిక కార్పొరేటర్ చందా నగర్ కాంగ్రెస్ నాయకులు మంజుల రఘు నాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాథీబాన్ రీజినల్ మేనేజర్ మారుతి సుజుకి ఉదయ్ కులకర్ణి సీఈవో సాయి సర్వీస్ గిరి బాబు సేల్స్ సాయి సర్వీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కారు ఎన్నో అధునాతన పిచర్స్ కలిగి ఉందని ఆటోమేటిక్ ట్రాన్స్మిషన్ మనువల్ ట్రాన్స్మిషన్ స్ట్రాంగ్ హైబ్రిడ్ నా క్యాప్ 5 స్టార్ రేటింగ్ పొందినది ఈ కారు లెవెల్ 2 అదాస్ పిచర్స్ వస్తుందని మారుతి సుజుకి రీజినల్ మేనేజర్ ప్రాథీబాన్ తెలిపారు. ఈ కారు మార్కెట్లో మారుతి సుజుకి ఉన్న డిమాండ్ కు అనుగుణంగా మార్కెట్లోకి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో తప్పకుండా ఈ కారు అధిక సేల్స్ జరుగుతాయని ఆశాభవం వ్యక్తం చేశారు.

## సిమ్ బాక్స్ రాకెట్ బట్టబయలు..
## ముగ్గురు అరెస్ట్, 200 సిమ్ కార్డులు స్వాధీనం

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ), టెలికమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ లు హైదరాబాద్‌లోని చంద్రాయణగుట్టలో ఒక సిమ్ బాక్స్ సెటప్‌ను ఛేదించి, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఒక సిమ్ బాక్స్‌తో పాటు సుమారు 200 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాల్లోకి వెళితే టెలికమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్‌లోని 'చక్షు పోర్టల్' ద్వారా సైబర్ మోసానికి సంబంధించిన ఒక ఫిర్యాదును అందుకుంది. ఈ ఫిర్యాదు ఆధారంగా, టీజీసీఎస్బీ బృందం కాల్ డిటైల్ రికార్డ్స్ (సీడీఆర్స్) ను విశ్లేషించి, సిమ్ బాక్స్ సెటప్ స్థానాన్ని గుర్తించింది. ఈ దాడుల్లో హైదరాబాద్ కు హఫీజ్ బాబానగర్ కు చెందిన హిదాయతుల్లా (28), సిమ్ కార్డుల విక్రేత అహద్ ఖాన్ (25), ఫూల్ బాగ్ కు చెందిన సిమ్ కార్డుల సేల్స్ మ్యాన్ షైక్ షోయెబ్ (24) అనే ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు హిదాయతుల్లా సోషల్ మీడియా ద్వారా ఒక వ్యక్తిని పరిచయం చేసుకున్నాడు. కారుల వ్యాపారంలో నష్టాలు వచ్చిన తర్వాత, అతను ఒక పెట్టుబడి గ్రూప్‌లో చేరి, దాదాపు రూ. 16 లక్షలు పోగొట్టుకున్నాడు. తరువాత, అతని స్నేహితుడు అతడిని వెనిస్సా అనే మహిళకు పరిచయం చేశాడు. వెనిస్సా సూచనల మేరకు, హిదాయతుల్లా సిమ్ బాక్స్ సెటప్‌ను ఏర్పాటు చేయడానికి



అంగీకరించాడు. ఫిబ్రవరి 2025లో అతనికి సిమ్ బాక్స్ కొరియర్ ద్వారా వచ్చింది. వెనిస్సా వీడియో కాల్ ద్వారా దాన్ని ఎలా ఇన్‌స్టాల్ చేయాలో వివరించింది. సిమ్ బాక్స్ ఏర్పాటు చేసిన తర్వాత, హిదాయతుల్లా తన స్నేహితుడు అహద్ ఖాన్‌ను సంప్రదించాడు. అహద్ ఖాన్, అతని స్నేహితుడు షోయెబ్ బీఎస్ఎన్ఎల్, వోడాఫోన్ పీఓఎస్ ఏజెంట్లుగా ఉన్నారు. వీరు కొల్లూరు ప్రాంతంలోని నిర్మాణ కార్మికుల ఆధార్ కార్డులను ఉపయోగించి అదనపు సిమ్ కార్డులను మోసపూరితంగా పొందారు. ఇలా దాదాపు 500 సిమ్ కార్డులను హిదాయతుల్లాకు సరఫరా చేశారు. ఈ సిమ్ బాక్స్‌ను ఉపయోగించి అంతర్జాతీయ వీఓఐసీ కాల్స్‌ను లోకల్ ఫోన్ కాల్స్‌గా మార్చి, సైబర్ నేరగాళ్లు తమ గుర్తింపును దాచుకుంటారు. ఈ కేసులో సిమ్ బాక్స్ ద్వారా పెద్ద ఎత్తున రిమోట్ కాల్స్ జరిగినట్లు, అంతర్జాతీయ సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగుతోంది.

## 10వ తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: 10వ తరగతి విద్యార్థులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేపడుతున్న సైకిళ్లను పంపిణీ నేడు ముస్తాబాద్ మండలంలో ప్రారంభమవుతుందని బిజెపి మండల అధ్యక్షుడు సౌల్ల క్రాంతి కుమార్ తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదినం సందర్భంగా మొదలు పెట్టిన ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. నేడు మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాల గ్రౌండ్ ఈ సైకిళ్ల పంపిణీ ప్రారంభోత్సమవుతుందని, ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పాల్గొని పంపిణీ చేస్తారని తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నలుపూ తెలుపుల అందం!



నలుపు, తెలుపు చిహ్నాలతో ఉన్న ఈ జీవులు చూడటానికి భలే ముద్దొస్తున్నాయి కదూ! కానీ ఇవేంటో తెలిస్తే కొందరు మొహం అదోలా పెడతారు.. మరికొందరు భయపడతారు కూడా. తిరుపతి ప్రాంతంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్) విద్యార్థులు పర్యటిస్తుండగా ఇవి కంటపడ్డాయి. తూర్పు కనుమల ప్రాంతంలో కనిపించే ఈ కీటకాలు ఓ జాతికి చెందిన బొద్దింకలు అని వారు పేర్కొన్నారు.

# 'ప్రకాశం' స్టేడియానికి 'గ్రహణం'..!





* అభివృద్ధికి ఆమడదూరంలో క్రీడా మైదానం
* క్రీడాకారులకు కనీస సౌకర్యాలు కరువు
* దశాబ్దాల చరిత్ర ఉన్నా... పట్టించుకునేవారు సున్నా..
* నేటినుంచి సింగరేణి కార్పొరేట్ స్థాయి క్రీడా పోటీలు*

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: 'ఎన్నికలొస్తే చాలు.. అన్ని రాజకీయ పార్టీల మీటింగ్‌లు అక్కడే.... దశాబ్దాలుగా క్రీడా పోటీలు నిర్వహించాలంటే గుర్తొచ్చేది అదే క్రీడా మైదానం... ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయాలన్నా... వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించాలన్నా... గుర్తుకొచ్చేది ఒక్కటే స్టేడియం. అదే కొత్తగూడెం పట్టణంలోని 'ప్రకాశం' స్టేడియం.' ఒకప్పుడు కొత్తగూడెం పట్టణంలో 'వెలుగులు' విరజమ్మిన 'ప్రకాశం' స్టేడియానికి నేడు గ్రహణం పట్టినట్లైంది గుంతలు పడిన మైదానంలో ఆటలు... పిచ్చి మొక్కల మధ్య వాకింగ్‌లు.... స్టేడియంలో సభలు, సమావేశాలు జరిగిన తరువాత ప్లాస్టిక్ కవర్లు, చెత్తా చెదారం మధ్య క్రీడాకారుల పాట్లు. ఇక క్రీడాకారులను వెక్కిరించే విరిగిన, తుప్పు పట్టిన బోర్డులు, చెదలుపట్టిన క్రీడా పరికరాలు, అరకొర క్రీడా సామాగ్రి. దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన ప్రకాశం స్టేడియం నేటి దుస్థితికి ఇవి ఒక మచ్చుతునక మాత్రమే. ఇలా చెప్పుకుంటూపోతే దశాబ్దాల చరిత్రతో పోలిస్తే స్టేడియంలో 'చెత్త' పనులే ఎక్కువగా ఉన్నాయి.

*** నిర్వహణ పట్టని 'సింగరేణి'**

సింగరేణి ప్రభావతి ప్రాంత క్రీడాకారులు, సింగరేణి కార్మికుల పిల్లలు, ఇతర ప్రయోజనాల నిమిత్తం కొత్తగూడెం పట్టణంలో ఉన్న ప్రకాశం స్టేడియం నిర్వహణను సింగరేణి సంస్థ చూసుకుంటుంది. క్రీడలపట్ల ఉన్న శ్రద్ధ, క్రీడల విలువ తెలిసిన నాటి సింగరేణి అధికారులు కొత్తగూడెం పట్టణ నడిబొడ్డులో ప్రకాశం స్టేడియం ఏర్పాటు చేశారు. అయితే రానురాను సింగరేణి సంస్థ ఆ నిర్వహణ బాధ్యతను సరిగా నిర్వర్తించడంలేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కొత్తగూడెం పట్టణంతోపాటు సమీప ప్రాంతాల్లో నిన్న మొన్న ఏర్పాటైన క్రీడా మైదానాలు అభివృద్ధి చెందుతున్నా... ప్రకాశం స్టేడియం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఈ స్టేడియంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కోలిండియా, సింగరేణి, కార్పొరేట్ ఏరియా స్థాయిలలో కార్మికులకు క్రీడా పోటీలను నిర్వహించడంతోపాటు సింగరేణి కార్మికుల పిల్లలే కాకుండా, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా క్రీడాకారులు వచ్చి ప్రాక్టీస్ చేస్తూ ఉంటారు. అయితే వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో కూడా సింగరేణి యాజమాన్యం విఫలమైందని క్రీడాకారులు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు.

*** క్రీడాకారులకు కనీస సౌకర్యాలు కరువు**

ప్రకాశం స్టేడియంలో క్రీడాకారుల కోసం సింగరేణి నిధులతో క్రీడా పరికరాలు కొనుగోలు చేస్తున్నప్పటికీ అవి ప్రాక్టీస్‌కి ఉపయోగించుకునే వీలు లేకుండా పోతోంది. స్టేడియానికి నియమించిన ఇన్‌చార్జి సరిగా విధులు నిర్వర్తించకపోవడంతో క్రీడా పరికరాలన్నీ స్టోర్ రూమ్‌లోనే ఉండిపోయి పాడైపోతున్నాయి. చివరకు సింగరేణి ఉద్యోగస్తులకు కూడా ప్రాక్టీస్ కోసం క్రీడా పరికరాలు ఇవ్వకపోవటం



గమనార్హం. స్టేడియంలో అభివృద్ధి పేరుతో పెద్దపెద్ద స్టేజీలు, రూములు కట్టారు కానీ అవి క్రీడాకారులకు ఏమాత్రం ఉపయోగపడటంలేదు. చివరకు క్రీడాకారుల ప్రాక్టీస్ కోసం కొనుగోలు చేసిన క్రీడా పరికరాలను ఇన్‌చార్జి కైంకర్యం చేస్తున్నారని క్రీడాకారుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాయంత్రం అయితే చాలు కనీసం స్ట్రీట్ లైట్లు, ఫ్లడ్‌లైట్లు లేకపోవడం వల్ల చీకటి అలుముకోవడంతో క్రీడాకారులు తొందరగానే ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

*** అభివృద్ధికి ఆమడదూరంలో స్టేడియం...**

ప్రకాశం స్టేడియం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటుంది. సింగరేణి యాజమాన్యం పట్టించుకోకపోవడం వల్ల క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, రన్నింగ్, జంపింగ్, షటిల్.. ఇలా పలు క్రీడల్లో నైపుణ్యం కోసం ప్రాక్టీస్ చేసుకునేందుకు ప్రకాశం స్టేడియంకు వచ్చే క్రీడాకారులకు అక్కడ తుప్పుపట్టిన బోర్డులు, తెగి పోయిన నెట్‌లు, గాలి కూడా లేని బాల్స్ వెక్కిరిస్తున్నాయి. ఇక మైదానం మొత్తం గుంతలమయంగా మారింది. సభలు, సమావేశాలు జరిగినప్పుడు దుంగలు పాతేందుకు గుంతలు తీసి, తరువాత వాటిని పూడ్చకుండా వదిలేయడంతో క్రీడాకారులు ప్రాక్టీస్ చేసే సమయాల్లో ఆ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఇక వాకింగ్ ట్రాక్ పూర్తిగా ధ్వంసం కావడం, చుట్టూ పిచ్చిచెట్లు పెరగడం, అప్పుడప్పుడు విషసర్పాలు, వీధి కుక్కలు తిరుగుతుండటంతో వాకర్లు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ లేని మరుగుదొడ్ల కారణంగా దుర్వాసన వెదజల్లడంతో వాకింగ్ చేసేవారు ముక్కుమూసుకుని వాకింగ్ చేయాల్సిన దుస్థితి ఉంది. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి ప్రకాశం స్టేడియాన్ని నేటి పరిస్థితులకు, క్రీడాకారుల సౌకర్యాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, ఈ విషయంలో సింగరేణి యూనియన్ నాయకులు సైతం జోక్యం చేసుకుని యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని, నిర్వహణ లోపాలు లేకుండా ప్రతినిత్యం పర్యవేక్షణ ఉండేలా చూడాలని క్రీడాకారులు కోరుతున్నారు.

*** నేటి నుంచి కార్పొరేట్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం**

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెం కార్పొరేట్ స్థాయి క్రీడా పోటీలను ఈనెల 12 నుంచి 28వ తేదీ వరకు ప్రకాశం స్టేడియంలో నిర్వహించనున్నారు. వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, క్యారమ్స్, చెస్, హాకీ, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, లాన్ టెన్నిస్, త్రోబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్, క్రికెట్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు సింగరేణి సంస్థ షెడ్యూల్ విడుదల చేసింది. అయితే ప్రస్తుతం వర్షాలు కురిసి, నీళ్లు నిలిచి, నిర్వహణ సరిగా లేక చెత్త చెదారం, పిచ్చి చెట్లతో ఉన్న ప్రకాశం స్టేడియంలో క్రీడాపోటీలు నిర్వహిస్తే తాము పాల్గొనలేమంటూ పలువురు క్రీడాకారులు పేర్కొంటున్నారు. సంస్థ క్రీడల నిర్వహణ సమయంలో కూడా స్టేడియంలో సౌకర్యాలు కల్పించకపోవడంపట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధ్వాన్నంగా ఉన్న స్టేడియంలో క్రీడాపోటీల్లో పాల్గొంటే తాము గాయాలపాలయ్యే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





# హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం : మంత్రి పొన్నం

నియోజకవర్గ అభివృద్దే నా లక్ష్యం అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ పునరుద్ఘాటించారు. గురువారం సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. నియోజకవర్గంలోని పలు మండలాలతో పాటు హుస్నాబాద్ మున్సిపాలిటీలో సుమారు రూ. 12 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం హుస్నాబాద్ బస్ స్టేషన్ ఆవరణలో 1932 లో నిజాం కాలం నాటి ఆల్బియన్ బస్ మోడల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... నియోజకవర్గం లోని గ్రామాల్లో ఏ సమస్య ఉన్న పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, నాళాలు, అంగన్వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు ఇలా అభివృద్ధి పనులు ప్రారంభించుకుంటున్నామన్నారు. హుస్నాబాద్ బస్టాండ్ పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలంలో జంక్షన్ అభివృద్ధి కొరకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఆర్టీసీ ఉద్యోగులు కలిసి హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో 1932 నాటి నిజాం నవాబు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్ మోడల్ ను ప్రారంభించుకున్నామని పేర్కొన్నారు. హుస్నాబాద్ అన్ని రకాల అభివృద్ధి చేస్తూ టూరిజం ,విద్య, ఇండస్ట్రియల్ ,అగ్రికల్చర్, ఉద్యోగ కల్పన కు సంబంధించి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ అవెన్యూ ప్లాంటేషన్



, జంక్షన్ డెవలప్మెంట్ చేసుకున్నామని రూ.2 కోట్లతో పల్లె చెరువు అభివృద్ధి చేసుకుంటామని పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణం కరీంనగర్ , సిద్దిపేట, హనుమకొండ, జనగామ జిల్లాలకు మధ్యలో ఉండడంతో అభివృద్ధి చేయడానికి శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు, ఇండస్ట్రియల్ పార్క్, మహాసముద్రం గండి టూరిజం ప్రాజెక్ట్, సర్దార్ సర్వాయి పాపన్న, ఎల్లమ్మ గుడి, పొట్లపల్లి శివాలయం ఇందులో భాగమై ఈ ప్రాంతమంతా అభివృద్ధి అయ్యేలా కార్యాచరణ తీసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో సంక్షేమం ,అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లు హైమావతి, పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ ఇతర ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు.

# దేశ నిర్మాణంలో జైళ్ల శాఖ అధికారుల పాత్ర కీలకం

**: మంత్రి బండి సంజయ్**

జైలు అంటే కేవలం నిర్బంధ స్థలం కాదని, చెదిరిన జీవితాలను పునర్నిర్మించడానికి అవకాశం ఇచ్చే ప్రదేశం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో జైళ్ల శాఖ అధికారుల పాత్ర కీలకమని తెలియజేశారు. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో ఈ నెల 9 నుంచి జరిగిన చారిత్రాత్మక 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్ 2025 గురువారం రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమానికి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కొన్ని సందర్భాల నుంచి ప్రేరణ పొంది.. 'నేరస్థుడిని కాదు, నేరాన్ని ద్వేషించండి అని అన్నారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలోని జైళ్లలో మనం జాగ్రత్తగా దిద్దుబాటుతో కస్టడీని నమ్ముతాము అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హోమ్ శాఖా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ డాక్టర్ జితేందర్, సమాచార,ప్రజా సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, భారతదేశం అంతటా ఉన్న అనేక మంది సీనియర్ ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 21 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల నుండి 1,200 మందికి




పైగా అధికారులు, సిబ్బంది, 140 మందికి పైగా సహాయక సిబ్బంది పాల్గొన్నారు, ఇది జైలు విధి సమావేశాల చరిత్రలో అతిపెద్ద సమావేశాలలో ఒకటిగా నిలిచింది. ఈ సంవత్సరం తెలంగాణ తొలిసారిగా ప్రవేశపెట్టిన టెక్నాలజీ ఎగ్జిబిషన్ ఒక ప్రధాన హైలైట్, ఇందులో ఆల్‌డ్రైవెన్ సిసిటివి పర్యవేక్షణ, డ్రోన్లు, బయోమెట్రిక్ వ్యవస్థలు, కాంట్రాబ్యాండ్ డిటెక్షన్ స్కానర్లు, డిజిటల్ ఖైదీ ట్రాకింగ్ మరియు రోబోటిక్స్ ప్రదర్శించబడ్డాయి. ఈ ఆవిష్కరణలు భవిష్యత్తులో సురక్షితమైన, పారదర్శకమైన మరియు మానవీయ జైళ్ల దార్శనికతను ప్రతిబింబిస్తాయి. సమాంతరంగా, జైలు ఉత్పత్తుల స్టాల్స్ గౌరవం, ఉత్పాదకత, పునరావాసాన్ని సూచించే చేనేత, హస్తకళలు మరియు ఖైదీలు తయారు చేసిన ఇతర వస్తువులను ప్రదర్శించాయి. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. శాస్త్రీయ నృత్యం, జానపద గీతాలు రంగస్థల నాటకాలను ప్రదర్శించారు.

*** తెలంగాణ కు 28 పతకాలు...**

అఖిల భారత జైలు డ్యూటీ మీట్ 2025లో తెలంగాణ జైళ్ళ శాఖ సత్తా చాటింది.. తెలంగాణ కు 21 బంగారం, 4 వెండి, 3 రజిత మొత్తం 28 పథకాలు దక్కించుకుంది. రెండో స్థానంలో 17 పథకాలతో తమిళనాడు, 6 పథకాలతో మూడో స్థానం మధ్యప్రదేశ్ రాష్ట్రము దక్కించుకుంది.

# 'మీ అభిప్రాయం చెప్పండి'.. బీఆర్ఎస్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్ లేఖ

రాష్ట్రంలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల అంశం రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతున్నది. బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై గెలిచి.. ఆ తర్వాత అధికార కాంగ్రెస్ గూటికి చేరిన పది మంది ఎమ్మెల్యేలపై వేటు కోసం బీఆర్ఎస్ న్యాయపోరాటం చేస్తూనే ఉన్నది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు డైరెక్షన్స్ ప్రకారం.. 10 మంది జంపింగ్ ఎమ్మెల్యేలకు స్పీకర్ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. అయితే.. ఇటీవల ఆ పది మంది ఎమ్మెల్యేలు సైతం స్పీకర్‌కు వివరణ ఇచ్చారు. తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని.. కేవలం అభివృద్ధి పనుల కోసమే సీఎంను కలిశామని.. తమ ఫొటోలు మార్ఫింగ్ చేసి పార్టీ మారినట్లుగా చూపారని వివరణ ఇచ్చారు. అయితే.. తాజాగా స్పీకర్ గడ్డం ప్రసాద్ బీఆర్ఎస్ పార్టీకి లేఖ రాశారు. పది మంది ఎమ్మెల్యేలు



ఇచ్చిన వివరణపై పార్టీ అభిప్రాయాన్ని కోరారు. మూడు రోజుల్లో తమ అభిప్రాయాన్ని వెల్లడించాలని కోరారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ ఏ విధంగా స్పందించబోతున్నదనే ఆసక్తి నెలకొంది.

## గొర్రెల పంపిణీ..
# కుంభకోణంలో బాధితులకు ఈడీ నోటీసులు

హైదరాబాద్: గొర్రెల పంపిణీ కుంభకోణంలో దర్యాప్తును ఈడీ అధికారులు వేగవంతం చేశారు. ఈ స్కామ్‌కు సంబంధించి ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ నెల 15న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని గొర్రెల పంపిణీ కుంభకోణం బాధితులకు నోటీసులు జారీ చేసింది. మొయినుద్దీన్ అండ్ గ్యాంగ్ ఏపీకి చెందిన రైతుల నుంచి గొర్రెలు కొనుగోలు చేసి దాదాపు రూ.2కోట్లు మేర మోసం చేసినట్టు ఈడీ దృష్టికి వచ్చింది.



రైతులకు చెల్లించాల్సిన నగదును ప్రభుత్వ అధికారుల సాయంతో బినామీలు, సొంత ఖాతాలకు మొయినుద్దీన్ బదిలీ చేసుకున్నట్టు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది.



# 'ముందు వారితో రాజీనామా చేయించు'.. కేటీఆర్ పై మంత్రి సీతక్క ఫైర్

ఆనాడు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, వివేకానంద గౌడ్ లచేత ముందు రాజీనామా చేయించు ఆ తర్వాత ప్రస్తుతం ప్రభుత్వంలో పనిచేస్తున్న పదిమంది ఎమ్మెల్యేల గురించి మాట్లాడాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు సవాల్ విసిరారు. గురువారం సాయంత్రం కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్ లో జరిగిన బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆనాడు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను, ఏ విధంగా అయితే పార్టీలో చేర్చుకున్నావో, అదే విధంగా తమ ప్రభుత్వంలో మీ పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేలు అభివృద్ధి సంక్షేమం కోసం చేరితే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ముందుగా ఆ ముగ్గురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, వారిని ఐదేళ్ల వరకు పోటీ చేయనీయకుండా చేసి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన పదిమంది ఎమ్మెల్యేల గురించి మాట్లాడాలని ఆమె సవాల్ విసిరారు. కష్టమో నష్టమో వారు మా పార్టీలో చేరారు. వారి డీఎన్ఏ చేంజ్ పేరుతో కన్న తల్లిదండ్రులను బాధ పెడతావా అంటూ మండిపడ్డారు. మీ పార్టీలో చేరిన వారికి న్యాయం అన్న మీరు, మా పార్టీలో చేరితే అన్యాయం అవుతుందా కేటీఆర్ అంటూ నిలదీశారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు తమ ప్రభుత్వం చేపడితే, ఇది గిట్టని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ద్వారా, పైడ్ ఆర్టిస్టులను పెడుతూ యూరియా పై తప్పుడు ప్రచారానికి తెరలేపారని మండిపడ్డారు.

# ఇచ్చిన ప్రతీ మాటకు కట్టుబడి ఉన్నాం.. మంత్రి పొంగులేటి ప్రకటన

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలబడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మంత్రుల నివాస సముదాయంలోని తన నివాసంలో ఈనెల 15 తేదీన కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లపై మంత్రులు సీతక్క, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తదితరులతో కలిసి సమీక్షించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. అందుకే స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లను బీసీల కోసం కృషి చేస్తుంటే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అడ్డుకుంటుందని సమావేశంలో మంత్రులు అభిప్రాయపడ్డారు. కామారెడ్డి వేదికగా ఇచ్చిన బీసీ కులగణన హామీని సీఎం రేవంత్ రెడ్డి,



పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో సాధించామని అన్నారు. ఈనెల 15న కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభ చాలా ప్రతిష్టాత్మకమైందని ఈ సభను విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన కార్యాచరణను ఈ సమావేశంలో చర్చించారు.

# పాఠశాలలో పదోతరగతి విద్యార్థి అనుమానాస్పద మృతి



హనుమకొండ: హనుమకొండ నైమ్‌నగర్‌లోని తేజస్వి హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న పోలేపల్లి జయంతి వర్ధన్ (15) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అకస్మాత్తుగా విద్యార్థి ముక్కు, చెవి నుంచి రక్తం రావడంతో గుర్తించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే, విద్యార్థి మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు. తమ కుమారుడి మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హనుమకొండ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

మహబూబ్ నగర్ ప్రతినిధి: మహబూబ్ నగర్ రూరల్ మండలం మాచన్ పల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ ముదిరాజ్ (23) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాచన్ పల్లి లోని ఒక యువతిని వెంకటేష్ ప్రేమించాడని తెలిసి మాచన్ పల్లి, గాజులపేట గ్రామాలకు చెందిన కొందరు యువకులు వెంకటేష్ ను చిత్ర హింసలకు గురిచేసి చెట్టుకు ఉరివేసి చంపారని మృతుడి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మృతుడి శరీరం వెనుక భాగంలో తీవ్ర గాయాలు, వృషణాలు చిదిమేసి ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు శవాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు రిజిస్టర్ చేసినట్లు, శుక్రవారం పోస్టుమార్టం తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని సీఐ గాంధీనాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

# ఓటర్ ఐడీ వివాదం.. కోర్టులో సోనియాగాంధీకి ఊరట

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీకి దిల్లీ కోర్టులో ఊరట లభించింది. ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. అసలు ఈ కేసు ఏంటంటే..? కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ దిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఆ వ్యవహారంలో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 1983లో సోనియాకు భారత పౌరసత్వం వచ్చింది. 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గత నెల భాజపా నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు సోనియా పేరును చేర్చారని పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని రాసుకొచ్చారు. అయితే దానిపై విమర్శలు రావడంతో 1982లో ఓటర్ జాబితా నుంచి ఆమె పేరు తొలగించారని, 1983లో



మళ్లీ కనిపించిందని వెల్లడించారు. అప్పుడు కూడా పౌరసత్వం రావడానికన్నా ముందే మళ్లీ జాబితాలోకి పేరు వచ్చి చేరిందని విమర్శించారు. "రాజీవ్‌ను వివాహమాడిన తర్వాత పౌరసత్వం రావడానికి 15 ఏళ్లు ఎందుకు పట్టిందని ఇక్కడ ప్రశ్నించడం లేదు. ముందే ఓటర్ జాబితాలో ఆమె పేరు కనిపించడం ఎన్నికల ప్రక్రియ దుర్వినియోగం కాకపోతే ఇంకేంటి..?" అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే దాఖలైన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను ఎన్నికల సంఘం చేపట్టడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇందులో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' చేపట్టిన సంగతి తెలిసిందే. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాలలో ఓట్లు చోరీ చేయడంలో ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని ఆయన ఆరోపించారు. ఈ విమర్శల వేళ సోనియా గాంధీ పౌరసత్వం, ఓటర్ జాబితాలో ఆమె పేరు చేరిన సమయాన్ని భాజపా ఎత్తి చూపింది.



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 10 మంది మావోయిస్టులు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, వరంగల్ జిల్లా ఘన్‌పూర్‌కు చెందిన మనోజ్ అలియాస్ మోదెం బాలకృష్ణ సహా 10 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. మనోజ్‌పై గతంలో రూ.2 కోట్ల రివార్డు ఉంది. మృతుల్లో ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రమోద్ యారఫ్ పాండు కూడా ఉన్నారు. మరికొందరు కీలకనేతలు చనిపోయినట్టు భావిస్తున్నారు. ఎదురు కాల్పులు ముగిసిన తర్వాతే మృతులపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముందని తెలుస్తోంది. గరియాబంద్ ఈ30, ఎస్టీఎఫ్, కోబ్రా జవాన్లు ఆపరేషన్‌లో పాల్గొన్నారు. గరియాబంద్ ఎస్పీ నిఖిల్ రఖేచా ఎన్‌కౌంటర్‌ని పర్యవేక్షిస్తున్నారు.

## విధివంచితుల పిల్లలకు.. పోలీసుల పాఠాలు!

ఒకప్పుడు పోలీసులను చూడగానే వణికిపోయేవారు. ఇప్పుడు వారు నిర్వహిస్తున్న విద్యాకేంద్రంలోనే చదువుకుంటున్నారు. బిహార్ ముజఫర్‌పుర్ వేశ్యావాటికకు చెందిన చిన్నారుల జీవితాల్లో వచ్చిన మార్పు ఇది. చతుర్భుజ్‌స్థాన్ ప్రాంతానికి చెందిన విధివంచితుల పిల్లలకు నసీమా ఖాతూన్ అనే సామాజిక కార్యకర్త మొదట్లో చదువు చెప్పేవారు. 2023లో దీపావళి పండగను పోలీసులతో కలిసి చేసుకునేందుకు చిన్నారులను ఖన్వాలీ అవుట్‌పోస్ట్‌కు తీసుకెళ్లారు. నసీమా సేవలు, పిల్లల ఆసక్తిని గమనించిన ఏఎస్పీ అవధేశ్ దీక్షిత్.. మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ముందుకొచ్చారు. పోలీస్ అవుట్‌పోస్ట్ సమీపంలోని ఖాళీ స్థలంలో పాఠశాల ఏర్పాటు చేశారు. పోలీసులనగానే మొదట్లో చిన్నారుల కుటుంబ సభ్యులు వెనకడుగు వేసినప్పటికీ.. క్రమంగా పరిస్థితిలో మార్పు వచ్చింది. వినూత్న పద్ధతుల్లో బోధన, ఆటపాటలు, పుట్టినరోజు వేడుకలు,



విద్యాసామగ్రి బహుమతులుగా ఇవ్వడం వంటి కార్యకలాపాలతో రక్షకభటులు పిల్లల మనసు గెలుచుకున్నారు. కొన్నాళ్లకు నసీమాతోపాటు పోలీసులే దగ్గరుండి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో వారికి అడ్మిషన్ కల్పించారు. తరగతులు ముగిశాక.. ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నారు. అతికొద్ది మంది పిల్లలతో మొదలైన ఈ విద్యాకేంద్రానికి నేడు దాదాపు 150 మంది వరకు వస్తున్నారు. బయటి విద్యార్థులు కూడా ఆసక్తి చూపుతున్నారు. గతేడాది అవధేశ్ వేరే జిల్లాకు బదిలీ అయినప్పటికీ.. ఇక్కడి చిన్నారులతో టచ్‌లో ఉన్నారు.

### భారత్‌లో దాడులకు కుట్రలు..
## పాక్ దౌత్యవేత్తకు ఎన్ఐఏ కోర్టు సమన్లు

పాకిస్థాన్ దౌత్యవేత్త అమీర్ జుబేర్ సిద్ధిఖీకి చెన్నైలోని ఎన్ఐఏ కోర్టు సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో భాగంగా అతడిని విచారణకు పిలిచింది. భారత్‌లోని అమెరికా, ఇజ్రాయెల్ కాన్సులేట్లపై దాడులకు కుట్రలు పన్నాడని ఆ సమన్లలో పేర్కొంది. కరాచీలోని అతడి చిరునామాను కూడా నోటీసుల్లో ప్రస్తావించింది. రికార్డుల ప్రకారం.. సిద్ధిఖీ శ్రీలంకలోని పాకిస్థాన్ హైకమిషన్‌లో వీసా కౌన్సిలర్‌గా చివరిగా విధులు నిర్వర్తించాడు. 2018లో ఎన్ఐఏ అతడిని వాంటెడ్ జాబితాలో చేర్చింది. ఫొటోను విడుదల చేసింది. అతడి నిక్‌నేమ్ బాస్ అని ఉంటుంది. దక్షిణ భారతదేశంలో 26/11 తరహా దాడులకు కుట్ర పన్నాడని పేర్కొంటూ అదే ఏడాది ఛార్జిషీట్ దాఖలు చేసింది. 2009 నుంచి 2016 మధ్య శ్రీలంకలో పని చేస్తున్నప్పుడు గూఢచర్యం, ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొనేవారితో




సంబంధాలు నెరిపాడని ఎన్ఐఏ తన దర్యాప్తులో గుర్తించింది. అసలు 2014లోనే సిద్ధిఖీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విధ్వంసం సృష్టించేందుకు సిద్ధిఖీ ఆదేశాల మేరకు భారత్‌కు వచ్చిన శ్రీలంక జాతీయుడు మహమ్మద్ సఖీర్ హుస్సేన్ అప్పట్లో చెన్నైలో పోలీసులకు చిక్కాడు. ఆ కేసులో పాక్ దౌత్యవేత్తపై తొలి కేసు నమోదైంది. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఆ కేసును అదే ఏడాది ఎన్ఐఏకు బదిలీ చేశారు. కాగా.. తాజా నోటీసుల ప్రకారం అక్టోబర్ 15న అతడు ఎన్ఐఏ కోర్టు ముందు హాజరుకావాల్సి ఉంది.

## 'కబాడీ మ్యాన్'.. పాత వస్తువుల్ని ఇంటికొచ్చి కొంటాడు!

బెళగావి: ఇంట్లో పనికిరాని వస్తువులు, పాత సామగ్రిని తీసుకెళ్లి ఎక్కడైనా అమ్మేద్దామంటే అందరికీ ఆ వీలు కుదరకపోవచ్చు. ఇంటి వద్దే విక్రయిద్దామన్నా.. అనుకున్న సమయానికి కొనుగోలు చేసేవారు రాకపోవచ్చు. ఈ సమస్యకు డిజిటల్ వేదికగా పరిష్కారం చూపారు ఇద్దరు కర్ణాటక యువకులు. వారే బెళగావికి చెందిన సిద్ధార్థ్, చిన్మయ. ఇంటికే వచ్చి పాత సామగ్రిని సేకరించేందుకు 'కబాడీ మ్యాన్' పేరిట వెబ్‌సైట్ నడిపిస్తున్నారు. మార్కెట్ ధర చెల్లిస్తూ.. స్థానిక తుక్కు వ్యాపారులు, వినియోగదారుల మధ్య వారధిగా వ్యవహరిస్తున్నారు. కొవిడ్ సమయంలో ఇంట్లో పాత వస్తువులను విక్రయించేందుకు ఎదురైన ఇబ్బందుల నుంచి సిద్ధార్థ్‌కు ఈ ఐడియా పుట్టుకొచ్చింది. మొదట్లో స్క్రాప్ ఈజీ యాప్‌తో ప్రయోగాలు చేసిన ఆయన.. 'కబాడీ మ్యాన్




(పాత సామగ్రి సేకరించే వ్యక్తి)' పేరిట ఈ ఏడాది జనవరిలో స్టార్టప్ ప్రారంభించారు. ఇప్పటివరకు రూ.49 లక్షల విలువైన ఆర్డర్లు తీసుకున్నారు. దాదాపు 50 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. 202526 ఆర్థిక సంవత్సరానికి రూ.4 కోట్ల వ్యాపారాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సేవలను ఐదేళ్లలో దేశవ్యాప్తంగా విస్తరించే యోచనలో ఉన్నారు.

## చెప్పాపెట్టకుండా విదేశాలకు వెళ్తున్నారు
### : రాహుల్ భద్రతపై సీఆర్పీఎఫ్ లేఖ

కాంగ్రెస్ అగ్రనేత, రాయబరేలీ ఎంపీ రాహుల్ గాంధీ భద్రతాపరమైన ప్రొటోకాల్ పాటించడం లేదని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఆరోపించింది. విదేశీ పర్యటనల వేళ ఆ నియమావళిని ఉల్లంఘించారంటూ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు హస్తంపార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌కు సీఆర్‌పీఎఫ్ లేఖ రాసింది. "రాహుల్‌గాంధీ తనకు అందిస్తోన్న భద్రతను సీరియస్‌గా తీసుకోలేదు. ఎక్కువ సందర్భాల్లో ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే విదేశాలకు వెళ్తున్నారు" అని సీఆర్పీఎఫ్ వీవీఐపీ సెక్యూరిటీ చీఫ్ సునీల్ ఆ లేఖలో పేర్కొన్నారు. డిసెంబర్‌లో ఇటలీ, మార్చిలో వియత్నాం, ఏప్రిల్‌లో దుబాయ్, జూన్‌లో ఖతార్, లండన్, సెప్టెంబర్‌లో మలేషియా పర్యటనకు రాహుల్ వెళ్లారని ప్రస్తావించారు. సీఆర్‌పీఎఫ్ ఎల్లో బుక్ నియమావళిని పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ, ఖర్గే, రాహుల్ నుంచి ప్రస్తుతానికి ఎలాంటి



స్పందనా రాలేదు. ప్రస్తుతం రాహుల్ గాంధీ అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లీజాన్ కలిగిన జెడ్+ సెక్యూరిటీ కవర్ కింద రక్షణ పొందుతున్నారు. తీవ్రముప్పు పొంచి ఉన్న వారికి ప్రభుత్వం ఈ స్థాయి భద్రతను కల్పిస్తుంటుంది. దీనికింద రాహుల్‌కు 55 మంది రక్షణగా ఉంటారు. వారిలో నేషనల్ సెక్యూరిటీ గార్డ్ కమాండోలు కూడా ఉంటారు. ఈ ఏఎస్ఎల్ కింద.. భద్రతా సిబ్బంది స్థానిక పోలీసులు, ఇంటెలిజెన్స్ యూనిట్లను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తిస్తారు. సదరు వీఐపీ పర్యటించే ప్రాంతం వద్ద ముందస్తు నిఘా ఉంచుతారు. ఇక, రాహుల్‌కు సీఆర్పీఎఫ్ ఇలా లేఖరాయడం ఇదే తొలిసారికాదు. 2020 నుంచి 113 సందర్భాల్లో భద్రతా ప్రొటోకాల్‌ను ఉల్లంఘించారని 2022లో లేఖరాసింది. మరోవైపు, 2023లో భారత్ జోడో యాత్రలో భాగంగా పలు భద్రతా వైఫల్యాలు వెలుగుచూశాయని అప్పట్లో కాంగ్రెస్ ఆరోపించింది. గత నెల 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా గుర్తుతెలియని వ్యక్తి ఒక్కసారిగా దూసుకొచ్చి.. రాహుల్‌ను ఆలింగనం చేసుకోవడం ఆందోళన కలిగించింది. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకకు మూడు దశాబ్దాలుగా అందిస్తోన్న స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ రక్షణను 2019లో కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఆ తర్వాత నుంచి సీఆర్పీఎఫ్ ఆ బాధ్యతలు చూస్తోంది.

### రష్యా చమురు కొనుగోలు ఆపేస్తేనే..
## భారత్‌తో చర్చలు: అమెరికా మంత్రి

భారత్ అమెరికా మధ్య సంబంధాలు ఇటీవల దెబ్బతిన్న వేళ వాణిజ్య చర్చలకు సంబంధించి అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లూట్నిక్ స్పందించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు ఆపేసిన తర్వాతే వాటిపై ముందుకు వెళ్తామనే సంకేతాలు ఇచ్చారు. అయితే, ఇటీవల ట్రంప్‌మోదీల స్నేహపూర్వక ట్వీట్‌లకు ముందు తీవ్ర హెచ్చరికలు చేసిన లూట్నిక్.. తాజా ఇంటర్వ్యూలో ఆచితూచి స్పందించారు. ప్రపంచ దేశాలపై అమెరికా సుంకాలు విధిస్తూ వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటోంది. ఈ క్రమంలో ఏ వాణిజ్య సమస్యపై ఎక్కువ దృష్టి పెట్టారని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. భారత్ పేరును ప్రస్తావించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం నిలిపివేసిన తర్వాత భారత్‌తో ముందుకెళ్తామన్నారు. అయితే, గతంలో వాణిజ్య చర్చలపై ఓ ఇంటర్వ్యూలో తీవ్రంగా స్పందించిన ఆయన.. భారత్



త్వరలోనే క్షమాపణలు చెబుతుందని, చర్చలకు ముందుకొస్తుందని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. మరోవైపు ఇరుదేశాల మధ్య చర్చలు సానుకూలంగానే కొనసాగుతున్నాయని, ఇరుపక్షాలు సంతృప్తికరంగా ఉన్నాయని భారత వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. మొదటి విడత ఒప్పందం నవంబర్ నాటికి ఖరారయ్యే అవకాశం ఉందన్నారు. వీటికి సంబంధించి చర్యలు చేపట్టాలని ఈ ఫిబ్రవరిలో భేటీ సందర్భంగా ట్రంప్‌మోదీలు తమ అధికారులను ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు.

## అంగారకుడిపై జీవం ఆనవాళ్లు!

అంగారక గ్రహంపై గతంలో జీవం మనుగడ సాగించిందనే వాదనకు బలం చేకూరే పరిణామం తాజాగా చోటు చేసుకుంది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా పంపిన మార్స్ రోవర్ పెర్సివరెన్స్ అక్కడ ఎండిపోయిన ఓ నది కాలువలో కొన్ని రాళ్లను గుర్తించింది. వాటిలో పురాతన సూక్ష్మ



జీవానికి సంబంధించిన ఆనవాళ్లు ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ మేరకు వారు బుధవారం వెల్లడించారు. అయితే ఆ నమూనాలను భూమిపై ప్రయోగశాలలో కూలంకషంగా పరిశీలించిన తర్వాతే పూర్తి స్పష్టత వస్తుందన్నారు. 2021 నుంచి అంగారకుడిపై పెర్సివరెన్స్ రోవర్ పరిశీలనలు సాగిస్తోంది.

## 20 ఏళ్ల తర్వాత ఆమె ఇంట్లో వెలుగులు

ఆమె ఇంటికి కొన్ని దశాబ్దాల నుంచి కరెంటు లేదు. చీకటైతే.. దీపంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. ఆమె ఇల్లు రెండు రాష్ట్రాల సరిహద్దుకి మధ్యలో ఉండటమే అందుకు కారణం. ఈక్రమంలో 20 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఆమె ఇంట్లో వెలుగులు నిండాయి. అసలేం జరిగిందంటే.. మహారాష్ట్ర , గుజరాత్‌కు సరిహద్దుల్లో గౌసావర్ అనే గ్రామం ఉంది. ఇక్కడ దాదాపు 600 మంది జనాభా ఉంటారు. వారిలో మగ్నీబెన్ (70) వృద్ధురాలి ఇంటిలో ఒక భాగం గుజరాత్‌లో, మరో భాగం మహారాష్ట్రలో ఉంటుంది. దీంతో ఆమె చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 20 ఏళ్లుగా ఆమె ఇంటికి విద్యుత్ కనెక్షన్ లేకుండా పోయింది. వితంతువు అయిన మగ్నీబెన్.. ప్రభుత్వం ఇచ్చే ఫించన్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. రాత్రయితే..





చీకట్లో ఆమె ఇబ్బందిపడేవారు. ఈక్రమంలో ఈటీవీ భారత్ ఆమె పరిస్థితిపై ఓ కథనాన్ని ప్రచురించింది. అది చర్చనీయాంశంగా మారగా.. గుజరాత్‌కు చెందిన విద్యుత్ సంస్థ అధికారులు స్పందించారు.

## లాభాల్లో బెంచ్ మార్క్ సూచీలు..

### 25వేల ఎగువన ముగిసిన నిఫ్టీ..!



**ముంబై:** దేశీయ బెంచ్ మార్క్ సూచీలు గురువారం లాభాల్లో ముగిశాయి. ఆగస్టు 21 తర్వాత తొలిసారిగా నిఫ్టీ 25వేల పాయింట్ల ఎగువన ముగిసింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,217.30 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఆ తర్వాత కోలుకుంది. ఈ క్రమంలో ఇంట్రాడేలో 81,216.91 పాయింట్ల కనిష్టానికి చేరుకున్న సెన్సెక్స్.. 81,642.22 పాయింట్ల గరిష్టానికి చేరుకుంది. చివరకు 123.58 పాయింట్ల లాభంతో 81,548.73 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 32.40 పాయింట్లు లాభపడి.. 25,005.50 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఫ్లాట్ నోట్‌లో ముగిశాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్ నిఫ్టీలో ప్రధాన లాభాలను ఆర్జించగా.. బజాజ్ ఆటో, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, విప్రో, టైటాన్ కంపెనీ నష్టాలను చవిచూశాయి. ఇంధనం, పీఎస్‌యూ బ్యాంక్, ఫార్మా, చమురు-గ్యాస్, మీడియా 0.5శాతం నుంచి ఒకశాతం వరకు పెరిగాయి. ఐటీ ఇండెక్స్ 0.5శాతం పతనం కాగా.. ఆటో ఇండెక్స్ 0.3శాతం దిగజారింది. రంజిత్‌నగర్ ప్లాంట్‌లో గ్యాస్ లీక్ సంఘటన కారణంగా గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ షేర్లు 3శాతం తగ్గాయి. కల్పతరు ప్రాజెక్ట్స్ షేర్లు 2.4శాతం లాభపడ్డాయి. రూ.2,720 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయి. ఇన్ఫోసిస్ షేర్లు 1.4శాతం పడిపోయాయి. బైబ్యాక్ కోసం బోర్డు సమావేశం జరగడానికి ముందే.. ఎంపీపీఎంసీఎల్ నుంచి అందుకున్నప్పటికీ అదానీ పవర్ షేర్లు 1.5శాతం తగ్గాయి. అపోలో ఫండ్స్‌తో కన్సార్టియంలో మాలికాప్‌ను కొనుగోలు చేయాలనే సంస్థ ప్రణాళికతో టెగా ఇండస్ట్రీస్ షేర్లు 2శాతం పడిపోయాయి. వారీ ఎనర్జీస్, జైడస్ వెల్నెస్, ఇండియన్ బ్యాంక్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, గుజరాత్ మినరల్ వంటి 100 కంటే ఎక్కువ స్టాక్‌లు బీఎస్ఈలో 52 వారాల గరిష్ట స్థాయిలను తాకాయి.

## ప్రపంచ కుబేరుడిగా లారీ ఎలిసన్..

### బ్లూమ్‌బర్గ్ ర్యాంకింగ్స్..!



**న్యూఢిల్లీ:** ప్రపంచ కుబేరుడిగా సాఫ్ట్‌వేర్ దిగ్గజం, ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎలిసన్ నిలిచారు. ఎలాన్ మస్క్‌ను దాటి ఆయన ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా మారారు. బ్లూమ్‌బెర్గ్ తాజా నివేదిక ప్రకారం.. ఒరాకిల్ షేర్లు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. దాంతో ఎలిసన్ సంపద అనేక బిలియన్ డాలర్లు పెరగడంతో ఎలాన్ మస్క్‌ను దాటేసి ప్రపంచ కుబేరుడిగా అవతరించారు. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. ఎలిసన్ సంపద ఇప్పుడు 393 బిలియన్ డాలర్లు. ఈ మొత్తం సంపద ఎలాన్ మస్క్ కంటే ఎనిమిది బిలియన్ డాలర్లు ఎక్కువ. నాలుగేళ్ల కింద ఎలాన్ మస్క్ తొలిసారిగా ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలిచాడు. ప్రస్తుతం ఆయన నికర విలువ 385 బిలియన్ డాలర్లు. మంగళవారం వరకు మస్క్ ప్రధాన సంస్థ అయిన టెస్లా షేర్లు 14శాతం తగ్గాయి.

కృత్రిమ మేధస్సు పోటీలో కస్టమర్ల నుంచి బిలియన్ డాలర్ల ఆర్డర్లు ఆధారంగా ఒరాకిల్ అద్భుతమైన ఆదాయ నివేదికను చూపించింది. దాంతో ర్యాంకింగ్స్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. అయితే, ఫోర్బ్స్ నివేదిక ప్రకారం మస్క్ ఇప్పటికీ 439 బిలియన్ డాలర్ల నికర విలువతో అగ్రస్థానంలో ఉన్నాడు. అయితే, బ్లూమ్‌బెర్గ్ తన సంపదను 385 బిలియన్లుగా చూపించింది. ఫోర్బ్స్-బ్లూమ్‌బెర్గ్ రెండూ మస్క్ ప్రైవేట్ కంపెనీలను (స్పేస్‌ఎక్స్-ఎక్స్ వంటివి) వేర్వేరుగా అంచనా వేయడం తేడాలు ఉన్నాయి. ఎలిసన్‌కు ఒరాకిల్‌లో దాదాపు 40 శాతం వాటాను ఉంది. అంటే స్టాక్ మార్కెట్ ప్రారంభమైన తక్కువ సమయంలోనే దాని పెరుగుతున్న షేర్లు ఆయన నికర విలువకు వంద బిలియన్ డాలర్లు జోడించింది. కంపెనీ తన ఆదాయాలను నివేదించినప్పుడు 300 బిలియన్లకు పైగా విలువైన కొత్త ఒప్పందాలను ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో తన క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాపారం ఆదాయం 77 శాతం పెరిగి 18 బిలియన్లకు పెరుగుతుందని ఆశిస్తున్నట్లు కంపెనీ తెలిపింది.నాలుగు సంవత్సరాలలో ఇది 144 బిలియన్లకు పెరుగుతుందని ఎల్లిసన్ పేర్కొన్నారు. మరో వైపు మస్క్ పెట్టుబడిదారులను ఆకట్టుకోవడంలో విఫలమవుతున్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో పడిపోయిన ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలలో కంపెనీ ఆశించిన బూమ్ ఇంకా కనిపించలేదు. మస్క్ నిరంతరం పెట్టుబడిదారుల దృష్టిని టెస్లా రోబోట్, కృత్రిమ మేధస్సు ప్రాజెక్టుల వైపు మళ్లించడానికి ప్రయత్నిస్తున్నాడు, కానీ ప్రతికూల వార్తలు ఆగడం లేదు. ఈ వేసవి ప్రారంభంలో యూరోపియన్ యూనియన్‌లో టెస్లా అమ్మకాలు 40 శాతం తగ్గాయి. వరుసగా ఏడో నెలలోనూ తగ్గాయి. మస్క్ ఎక్స్‌లో నేరపూరిత రాజకీయ నాయకులకు మద్దతు ఇచ్చిన తర్వాత కస్టమర్లు దూరమవుతున్నారు. డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు ఇవ్వడంపై చాలామంది కోపంగా ఉన్నారు. దాంతో కొనుగోలుదారులు టెస్లా కార్లను కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. కంపెనీ యూఎస్ మార్కెట్‌లో వాటా కోల్పోతూ వస్తున్నది.

## భారీగా తగ్గిన కార్ల ధరలు..



**న్యూఢిల్లీ:** కారు కొనాలని ఆలోచిస్తున్న వారికి త్వరలో భారీ ఊరట కలుగనున్నది. కేంద్రం ఇటీవల జీఎస్టీ సంస్కరణలు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉన్న శ్లాబుల విధానాన్ని మార్చింది. నాలుగు శ్లాబుల స్థానంలో రెండింటిని తీసుకువచ్చింది. మోదీ ప్రభుత్వం 2.0 జీఎస్టీ అమలుతో అనేక ఆటో కంపెనీలు తమ వాహనాల ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. కొత్త పన్ను విధానం సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి రానున్న విషయం తెలిసిందే. చిన్న కార్లపై (పెట్రోల్-ఎల్‌పీజీ-సీఎన్‌జీ ఇంజిన్ 1200 సీసీ వరకు నాలుగు మీటర్ల కంటే తక్కువ పొడవు, డీజిల్ 1,500 సీసీ వరకు) ఇకపై జీఎస్టీ 18శాతం వర్తించనున్నది. మరోవైపు భారీ, లగ్జరీ వాహనాలపై 40 శాతం పన్ను విధించనున్నారు. గతంలో కార్లపై జీఎస్టీ 28శాతంగా ఉండేది. ప్రత్యేకంగా సెస్ కూడా ఉండేది. జీఎస్టీ సంస్కరణలతో వినియోగదారులు భారీగా ప్రయోజనం ఉండదనున్నారు. కొత్త జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందిస్తామని టాటా మోటార్స్ తెలిపింది. కంపెనీ వాహనాలు రూ.75వేల నుంచి రూ.1.55లక్షల వరకు ధరలు తగనున్నాయి. కంపెనీకి చెందిన నెక్సాన్ మోడల్ రూ.1.55లక్షల వరకు తగ్గించింది. సఫారీ రూ.1.45 లక్షలు, హారియర్ రూ.1.40 లక్షలు, ఆల్ట్రోజ్ రూ.1.10 లక్షలు, పంచ్ రూ.85వేలు, టియాగో రూ.75వేలు, టీగోర్ రూ.80వేలు, కర్వ్ రూ.65వేలు వరకు తగ్గనున్నాయి. ఇక మారుతి సుజుకి ధరలు సైతం భారీగానే తగ్గనున్నాయి. ఇక మహీంద్రా అండ్ మహీంద్రా సైతం ధరలను తగ్గించింది. యూఎస్‌యూవీ, యూవీ విభాగాల్లోనూ రూ.1.56లక్షల వరకు ధరలను తగ్గించింది.



# ప్రపంచకప్‌లో మహిళలకు పట్టం..

### రిఫరీలు, అంపైర్ల బృందంలో అందరూ అతివలే..!

**న్యూఢిల్లీ:** మహిళా క్రికెట్‌కు విశేష గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈమధ్యే వరల్డ్ కప్ విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీని భారీగా పెంచిన ఐసీసీ.. ఇప్పుడు పూర్తిగా మహిళా బృందంతోనే మెగా టోర్నీని నిర్వహించనుంది. అవును.. భారత్, శ్రీలంక ఆతిథ్యమిస్తున్న వన్డే వరల్డ్ కప్‌లో రిఫరీల నుంచి అంపైర్ల వరకూ అందరూ మహిళలే ఉంటారని జై షా నేతృత్వంలోని ఐసీసీ స్పష్టం చేసింది. వన్డే ప్రపంచ కప్ చరిత్రలో పూర్తిగా అతివలకే పట్టం కట్టడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

సెప్టెంబర్ 30 నుంచి వరల్డ్ కప్ టోర్నీ జరుగనుంది. దాంతో.. గురువారం ఐసీసీ మ్యాచ్ నిర్వాహకుల జాబితాను ప్రకటించింది. 18 మంది అధికారిణులు, 14 మంది అంపైర్లు, నలుగురు రిఫరీలతో కూడిన మహిళా బృందాన్ని ఎంపిక చేసింది. 31 రోజుల పాటు జరిగే ఈ మెగా ఈవెంట్ బాధ్యతలను వీళ్లకే అప్పగించింది ఐసీసీ. రెండేళ్ల క్రితం టీ20 వరల్డ్ కప్, కామన్‌వెల్త్ గేమ్స్‌లోనూ మహిళా బృందానికి ప్రాధాన్యం ఇచ్చింది. ఇప్పుడు అదే ట్రెండ్‌కు వన్డే వరల్డ్ కప్‌లోనూ శ్రీకారం చుట్టింది జై షా టీమ్.



**మ్యాచ్ రిఫరీలు :** జీఎస్ లక్ష్మి(భారత్), మిచెల్లె పెరీరా(శ్రీలంక), ట్రుడీ అండర్సన్ (న్యూజిలాండ్), షాంద్రే ఫ్రిట్జ్ (దక్షిణాఫ్రికా).

**ఆన్ ఫీల్డ్ టీవీ అంపైర్లు :** వ్రిందా రథీ, గాయత్రి వేణుగోపాలన్ (భారత్), నిమలీ పెరీరా(శ్రీలంక), సూ రెడ్‌ఫెర్న్(ఇంగ్లండ్), క్లేరీ పొలొసక్, ఎలోసీ షెరిడాన్(ఆస్ట్రేలియా), కాండసే లా బోర్డే, జాక్వెలిన్ విలియమ్స్(వెస్టిండీస్), కిమ్ కాటన్(న్యూజిలాండ్), సరాహ్ దంబనేవన్ (జింబాబ్వే), షథిరా జకీర్ జెసీ(బంగ్లాదేశ్), కెరరీన్ క్లాస్టే, లారెన్ అజెంబగ్(దక్షిణాఫ్రికా).

'మహిళా క్రికెట్ చరిత్రలో ఇది గర్వించదగ్గ క్షణం. మేము తీసుకున్న ఈ నిర్ణయం మిగతా ఆటలకు కూడా ప్రేరణ అవుతుందని భావిస్తున్నాం. పూర్తిగా మహిళలతో కూడిన బృందాన్ని ఎంపిక చేయడం అనేది ఒక మైలురాయి మాత్రమే కాదు లింగ సమానత్వానికి పాటుపడుతున్న ఐసీసీ నిబద్ధతకు నిదర్శనం' అని షా ఒక ప్రకటనలో వెల్లడించాడు. పదమూడో ఎడిషన్‌కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. దాంతో.. ఇరుదేశాలకు చెందిన అంపైర్లు, రిఫరీలకు ప్యానెల్‌లో చోటు దక్కింది. ఇక క్లారీ పొలోసాక్, జాక్వెలిన్ విలియమ్స్, సూ రెడ్‌ఫెర్న్‌లు మూడోసారి వరల్డ్ కప్ నిర్వహణలో భాగం కానున్నారు. సెప్టెంబర్ 30న జరుగబోయే వరల్డ్ కప్ ఆరంభ పోరులో భారత్, శ్రీలంక తలపడనున్నాయి.

## తొమ్మిదో సీడ్‌ను చిత్తు చేసిన ఆయుశ్..

### క్వార్టర్స్‌లో చిరాగ్-సాత్విక్ జోడీ..!



**హాంకాంగ్:** హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత షట్లర్లు జోరు చూపిస్తున్నారు. పురుషుల సింగిల్స్‌లో ఆయుశ్ శెట్టి సంచలన విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఉత్కంఠగా సాగిన పోరులో అతడు ఏకంగా తొమ్మిదో సీడ్‌కు షాకిచ్చాడు. కొడాయ్ నరౌకాను చిత్తుగా ఓడించాడు. మరో పోరులో భారత్‌కే చెందిన హెచ్ఎస్ ప్రణయ్‌ను లక్ష్యసేన్ ఓడించారు. క్వార్టర్స్‌లో ఆయుశ్‌తో సేన్ తలపడనున్నాడు.

జూనియర్ స్థాయిలో సంచలన విజయాలతో అబ్బురపరిచిన ఆయుశ్ శెట్టి హాంకాంగ్ ఓపెన్‌తో చెలరేగిపోతున్నాడు. అటాకింగ్ గేమ్‌తో కొడాయ్ నరౌకాను మట్టికరిపించిన అతడు తొలిసారి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నీలో క్వార్టర్స్ చేరాడు. తొలి సెట్‌ను 21-19తో గెలుపొందిన ఆయుశ్ రెండో సెట్‌లో మాత్రం తడబడ్డాడు. దాంతో, నారోకా 21-12తో పైచేయి సాధించాడు. నిర్ణయాత్మక మూడో సెట్‌లో జపాన్ స్టార్‌కు ఆయుశ్ చుక్కలు చూపించి 21-14తో మ్యాచ్‌ను ముగించాడు.

### సేన్, సాత్విక్ జోడీ జోరు

భారత షట్లర్ల మధ్య గురువారం జరిగిన మరో పోరులో ప్రణయ్‌ను 15-21, 21-18, 21-10తో లక్ష్య సేన్ ఓడించాడు. తద్వారా ఆరునెలలో మొదటిసారి క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడీ యంగ్‌స్టర్. తదుపరి మ్యాచ్‌లో ఆయుశ్‌ను సేన్ ఢీకొననున్నాడు. దాంతో.. భారత్ నుంచి ఒకరు సెమీఫైనల్ చేరడం ఖాయమైంది. ఈమధ్యే ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రెండో కాంస్యంతో చరిత్ర సృష్టించిన సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి ద్వయం కూడా దుమ్మురేపింది. ప్రత్యర్థిని చిత్తుగా ఓడించి అలవోకగా క్వార్టర్ ఫైనల్ చేరింది. సెమీస్ బెర్తు కోసం ఈ జోడీ జునైదీ అరిఫ్-రాయ్ కింగ్ యాప్ (మలేషియా) జంటను ఢీ కొట్టనుంది.

## వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ సెమీస్‌లోకి పూజా రాణి

**వార్సా:** ఇండియన్ బాక్సర్ పూజా రాణి.. ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాన్ని ఖాయం చేసుకున్నది. మహిళల 80 కేజీల విభాగంలో ఆమె సెమీఫైనల్లోకి ప్రవేశించింది. దీంతో పూజా రాణికి మెడల్ దక్కడం అనివార్యం కానున్నది. క్వార్టర్స్‌లో పోలాండ్ క్రీడాకారిణి ఎమిలియా కోటెర్స్కాను చిత్తు చేసి పూజా విజయాన్ని నమోదు చేసింది. ఈ పోటీల్లో తొలి రౌండ్‌లో 34 ఏళ్ల పూజాకు బై దక్కింది. అయితే అనుభవం ఉన్న పూజా.. క్వార్టర్స్‌లో టీనేజర్ ఎమిలియాపై 3-2 తేడాతో విక్టరీ సొంతం చేసుకున్నది. గురువారం రాత్రి ఈ బౌట్ జరిగింది. 80 కేజీల విభాగంలో ఫైట్‌ను నాన్ ఒలింపిక్ వెయిట్ కేటగిరీగా భావిస్తారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మొత్తం 12 మంది బాక్సర్లు ఈ కేటగిరీలో పోటీపడుతారు.



ఈ పోటీల్లో ఇప్పటికే రెండు మెడల్స్ ఖాయం అయ్యాయి. జాస్మిన్ లాంబోరియా, నుపుర్ షీరాన్ బాక్సర్లకు మెడల్స్ దక్కనున్నాయి. ఆ ఇద్దరు కూడా సెమీస్‌లోకి ప్రవేశించారు. పురుషుల కేటగిరీలో భారత్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. అభినాశ్ జామ్‌వాల్ 65 కేజీల విభాగంలో క్వార్టర్స్‌లో ఓడారు. గత ఏడాది జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ టోర్నీలో మహిళల విభాగంలో ఇండియాకు నాలుగు స్వర్ణ పతకాలు దక్కాయి. నీతూ ఘంగాస్, నిఖ్బత్, లవ్లీనా బోర్గోహెయిన్, సావేతి బోరా ఇండియాకు పతకాలను అందించారు. సెమీఫైనల్లో లోకల్ బాక్సర్ ఎమిలీ అస్క్విత్‌తో పూజా రాణి తలపడనున్నారు.

# ప్రభుత్వం నుంచి ఒత్తిడి..

### సెర్బియాను వీడి గ్రీస్‌కు షిఫ్ట్ అయిన జకోవిచ్..!

**గ్రీస్:** సెర్బియా స్టార్, 24 సార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన నోవాక్ జకోవిచ్ సెర్బియాను వీడినట్లు తెలుస్తోంది. ఆయన గ్రీస్‌కు మకాం మార్చినట్లు సమాచారం. ఇప్పటికే తన ఫ్యామిలీని అక్కడికి షిఫ్ట్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. సెర్బియాలో ప్రభుత్వ అనుకూల వర్గాల నుంచి పెరుగుతున్న ఒత్తిడి కారణంగానే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సదరు కథనాలు వెల్లడిస్తున్నాయి. మీడియా రిపోర్ట్స్ ప్రకారం.. గత డిసెంబర్‌లో నోవి సాడ్‌లోని రైల్వే స్టేషన్‌లో జరిగిన విషాద సంఘటనతో సెర్బియాలో నిరసనలు చెలరేగాయి. దీని ఫలితంగా దాదాపు 16 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో నిరసనకారులు వీధుల్లోకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ అవినీతిని నిరసిస్తూ, రాజకీయ సంస్కరణలకు పిలుపునిస్తూ విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. సెర్బియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులకు జకోవిచ్ బహిరంగంగా మద్దతు ప్రకటించారు.

బెల్‌గ్రేడ్ బాస్కెట్‌బాల్ గేమ్‌లో 'స్టూడెంట్స్ ఆర్ ఛాంపియన్స్' అని ఉన్న స్వెట్టర్‌ను ధరించి మద్దతు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను కూడా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అప్పటి నుంచి అతడిపై ప్రభుత్వం నుంచి తీవ్ర స్థాయిలో ఒత్తిడి వచ్చింది. ఈ కారణంతో తన సొంత దేశాన్ని వదిలి వెళ్లిపోవాలని జకోవిచ్ నిర్ణయించుకున్నట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి.

ఇందులో భాగంగానే గ్రీస్‌కు తన ఫ్యామిలీని షిఫ్ట్ చేసినట్లు



తెలిసింది. గ్రీకు రాజధానిలో ఓ ఇంటిని కూడా జకోవిచ్ కొనుగోలు చేసినట్లు సదరు కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇక ఇప్పటికే గ్రీక్ గోల్డెన్ వీసాకు జకోవిచ్ దరఖాస్తు చేసినట్లు సమాచారం. ఏథెన్స్‌లోని సెయింట్ లారెన్స్ కాలేజీలో తన పిల్లలు స్టెఫాన్, తారా కోసం అడ్మిషన్లు కూడా తీసుకున్నట్లు సమాచారం.



షారుక్, దీపికా పదుకొనేలకు ముందస్తు

# బెయిల్ మంజూరు

కారు యాడ్ వివాదంలో షారుఖ్, దీపికాకు ఊరట

రాజస్థాన్ హైకోర్టులో ముందస్తు బెయిల్ మంజూరు

తయారీ లోపాలకు అంబాసిడర్లు బాధ్యులు కారన్న న్యాయవాదులు

**రాజస్థాన్ :** బాలీవుడ్ స్టార్స్ షారుఖ్ ఖాన్, దీపికా పదుకొణెలకు రాజస్థాన్ హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. భద్రతా ప్రమాణాలు లేని కారుకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించారంటూ తమపై నమోదైన కేసులో న్యాయస్థానం వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. వీరితో పాటు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఆరుగురిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై కూడా స్టే విధిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌కు చెందిన కీర్తి సింగ్ అనే మహిళా న్యాయవాది ఈ పిటిషన్ దాఖలు చేశారు. తాను హ్యూందాయ్ కంపెనీకి చెందిన కారును కొనుగోలు చేశానని, కేవలం షారుఖ్, దీపికా దానిని ప్రమోట్ చేస్తున్నారన్న నమ్మకంతోనే ఆ నిర్ణయం తీసుకున్నానని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, కారులో అనేక లోపాలు బయటపడ్డాయని, వినియోగదారులను తప్పుదోవ పట్టించారంటూ వారిద్దరితో పాటు మరో ఆరుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్ నమోదైంది. దీనిపై ఆమె ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు.

ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా షారుఖ్ ఖాన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కారు తయారీ ప్రమాణాలతో గానీ, దానిలోని లోపాలతో గానీ తన క్లయింట్‌కు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని కోర్టుకు తెలిపారు. కేవలం బ్రాండ్ ప్రచారంలో పాల్గొన్నంత మాత్రాన ఉత్పత్తి నాణ్యతకు బాధ్యత వహించలేరని ఆయన స్పష్టం చేశారు. దీపికా పదుకొణె తరఫు న్యాయవాది మాధవ్ మిత్రా కూడా ఇదే తరహా వాదనలు వినిపించారు. కారు ఉత్పత్తిలో గానీ, నాణ్యత నియంత్రణలో గానీ తన క్లయింట్ పాత్ర ఏమీ లేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. షారుఖ్, దీపికాతో పాటు మిగిలిన వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 25వ తేదీకి వాయిదా వేసింది.

# ఎవరికైనా ఇలాంటి అవకాశం లభిస్తుందా..?

మాళవిక మోహనన్

మమ్ముట్టిపై మాళవిక ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు

షూటింగ్ స్పాట్‌లో చూసి, స్వయంగా ఫొటోలు తీశారన్న మాళవిక

తన మొదటి సినిమాకు మమ్ముట్టే ఆడిషన్ చేశారని వెల్లడి



టాకీస్: మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి లాంటి ఒక లెజెండరీ నటుడు స్వయంగా ఫొటోగ్రాఫర్‌గా మారి ఒక కొత్తమ్మాయికి ఆడిషన్ చేయడం ఎవరైనా ఊహించగలరా? కానీ, తన విషయంలో అదే జరిగిందని అంటున్నారు ప్రముఖ కథానాయిక మాళవిక మోహనన్. ప్రస్తుతం ప్రభాస్ సరసన 'రాజా సాబ్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతున్న ఈ బ్యూటీ, తన సినీ ప్రస్థానం ఎలా మొదలైందో వివరిస్తూ ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాళవిక, తాను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి మమ్ముట్టినే కారణమని తెలిపారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేయూ మోహనన్ కుమార్తె అయినప్పటికీ, తనకు కూడా ఆడిషన్ తప్పలేదని ఆమె గుర్తుచేసుకున్నారు. తన తొలి మలయాళ చిత్రం 'పట్టంపోలే' కోసం హీరోయిన్‌ను వెతుకుతున్న సమయంలో, ఒక షూటింగ్ లొకేషన్‌లో ఉన్న తనను మమ్ముట్టి చూశారని చెప్పారు.

ఆమె మాట్లాడుతూ.. "అక్కడ నన్ను చూసిన మమ్ముట్టి గారు, వెంటనే నా ఫొటోలు తీశారు. సినిమా కోసం ఆడిషన్ కూడా ఆయనే చేశారు. అలాంటి గొప్ప నటుడి చేతుల మీదుగా ఆడిషన్ చేయించుకునే అదృష్టం ఎవరికి దక్కుతుంది..? ఆయనే నన్ను చిత్రబృందానికి పరిచయం చేసి, నా మొదటి సినిమా అవకాశాన్ని ఇప్పించారు. అలా ఆయన వల్లే నా సినీ ప్రయాణం మొదలైంది" అని తన పాత జ్ఞాపకాలను వివరించారు. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన 'పట్టంపోలే' సినిమాతో మాళవిక కథానాయికగా పరిచయమయ్యారు. ఆ తర్వాత రజినీకాంత్ 'పేట', విజయ్ 'మాస్టర్', విక్రమ్ 'తంగలాన్' వంటి భారీ చిత్రాలతో దక్షిణాదిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ప్రభాస్‌తో కలిసి 'రాజా సాబ్' ద్వారా తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టబోతున్నారు.

## సిద్ధూ జొన్నలగడ్డ.. తెలుసుకదా టీజర్ విడుదల



**టాకీస్:** యువ హీరో సిద్ధు జొన్నల గడ్డ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తెలుసు కదా. ఈ సినిమాకు పాపులర్ స్క్రీన్ రైటర్ కోన వెంకట్ సోదరి నీరజ కోన దర్శకత్వం వహిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అక్టోబర్ 17న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను వదిలారు మేకర్స్. ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి, టాలీవుడ్ బ్యూటీ రాశి ఖన్నా కథానాయికలుగా నటించబోతున్నారు. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి యువరాజ్ సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు.

## చీరకట్టిన చందమామ..

అదరగొట్టిన అందాల భామ

అవికా గోర్

టాకీస్: చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ ద్వారా దక్షిణాది ప్రేక్షకులకు ఇష్టమైన నటిగా మారింది అవికా గోర్. బాలనటిగా బుల్లితెరపై సందడి చేసిన ఈ అమ్మడు.. ఇప్పుడు హీరోయిన్‌గా వెండితెరపై అలరిస్తుంది. ఈ అమ్మడి అందాలకు కుర్రాళ్ళు ఫిదా అవుతున్నారు. చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ తో తెలుగు వారికి బాగా దగ్గరయ్యింది అవికా గోర్. ఆ తర్వాత రాజ్ తరుణ్ నటించిన ఉయ్యాలా జంపాల సినిమాతో హీరోయిన్ గా వెండితెరకు పరిచయమైంది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇందులో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. సినిమా కూడా హిట్ కావడంతో వరుసగా అవకాశాలు వచ్చాయి. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సినిమాలు చేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. గత కొద్దిరోజులుగా అవికా గోర్ తెలుగు సినిమాలకు దూరంగా ఉంటుంది. బాలీవుడ్ లో ఎక్కువగా ఫోకస్ పెట్టింది. అక్కడ సినిమాలు, వెబ్ సిరీస్ లు చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది.ఇక ఇప్పుడు తెలుగులో మరోసారి అదృష్టం పరీక్షించుకుంది. అది సాయి కుమార్ హీరోగా షణ్ముఖ అనే సినిమాలో నటించింది. హారర్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఇటీవలే విడుదలైంది. ఆశించిన స్థాయిలో ఈ సినిమాలో ఆకట్టుకోలేకపోయింది. మరి ఈ సినిమా తర్వాత వరుసగా సినిమాలు చేస్తుందా లేదా అన్నది చూడాలి.



**టాకీస్:** బాలీవుడ్‌లో చిన్న సినిమాగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకున్న సైయారా చిత్రం ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ- వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం సెప్టెంబర్ 12 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు మోహిత్ సూరి దర్శకత్వం వహించగా.. ఆహాన్ పాండే, అనిత్ పడ్డా హీరో హీరోయిన్‌లుగా నటించారు. ఆషికీ 2, ఎక్ విలన్ వంటి బ్లాక్ బస్టర్ల తర్వాత మోహిత్ సూరి దర్శకత్వంలో ఈ సినిమా రావడంతో మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే జూలై 18న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఆ అంచనాలను అందుకుంటూ బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. మొదటిరోజు నుంచే భారీ కలెక్షన్లు రాబడుతున్న ఈ చిత్రం ఇటీవల రూ.581 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టినట్లు- చిత్రబృందం యష్‌రాజ్

## నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలవుతున్న సైయారా



ఫిలిమ్స్ ప్రకటించింది. ఈ సందర్భంగా సరికొత్త రికార్డును అందుకుంది. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చి అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా ఈ సినిమా నిలిచింది. కేవలం ఇండియాలోనే రూ.400 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించగా.. వరల్డ్ వైడ్‌గా రూ.169 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. మరోవైపు ఈ సినిమా ఓటీటీ రానుడటంతో ప్రేక్షకులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.